KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :76 | శుక్రవారం , 14 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# హరీష్ రావు పాదయాత్ర?



బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పాదయాత్రకు లైన్ క్లియర్ అయినట్లేనా ? ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను వెంటనే ప్రారంభించాలనే డిమాండుతో హరీష్ పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. అయితే పాదయాత్రను ఎప్పుడు ప్రారంభించాలనే విషయంలో కాస్త అయోమయంలో ఉన్నారు. ఎందుకంటే అసెంబ్లీ సమావేశాలు, స్థానికసంస్థల ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వస్తుందో తెలీదు కాబట్టి పై రెండు విషయాల్లో క్లారిటి వచ్చిన తర్వాత తన పాదయాత్రకు ముహూర్తం పెట్టుకోవాలని హరీష్ అనుకున్నారు. తాజా అప్ డేట్స్ ప్రకారం స్థానికసంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశంలేదని తెలుస్తోంది.

ఎందుకంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆమధ్య జరిగిన కులగణన సర్వేను మరోసారి చేయించాలని రేవంత్ రెడ్డి డిసైడ్ అయ్యారు. అలాగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చిలో మొదలవుతాయి. ఈ సమావేశాలు సుమారు 15 రోజులు జరుగుతాయి. అసెంబ్లీ జరుగుతున్నపుడు ఎన్నికలు జరగవు. అంటే మార్చినెల బడ్జెట్ సమావేశాలకు సరిపోతుంది. ఇదే సమయంలో అంటే మార్చి 18వ తేదీన పదవ తరగతి పరీక్షలు అయిపోయిన తర్వాతి మిగిలిన తరగతుల పరీక్షలు జరుగుతాయి. కాబట్టి పరీక్షలు జరుగుతున్నపుడు ఎన్నికలు జరగవు.అంటే కులగణన, బడ్జెట్ సమావేశాలు, పిల్లల పరీక్షల కారణంగా మార్చిలో స్థానికసంస్థల ఎన్నికలు జరగవని అర్ధమవుతోంది. తర్వాత ఏప్రిల్-మే నెలలో ఎన్నికలు జరపవచ్చు. అయితే ఈ రెండునెలల్లో మాడు పగిలిపోయేంత ఎండలుంటాయి. అంత ఎండల్లో ఎన్నికలు నిర్వహించటమూ కష్టమే, అభ్యర్ధులు, నేతలు ప్రచారం చేయటమూ కష్టమే. పైగా అంతటి ఎండలంటే మంచినీటి ఎద్దడితో ఇబ్బందిపడే ప్రాంతాలుంటాయి. అలాగే విద్యుత్ సరఫరాకు అంతరాయాలు కూడా ఉంటాయి. కాబట్టి నీళ్ళు దొరక్క, విద్యుత్ కోతలతో జనాలు ప్రభుత్వంపై మండిపోతుంటారు.

## మణిపూర్‌లో
# రాష్ట్రపతి పాలన విధింపు

కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు గురువారం సాయంత్రం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. జాతుల వైరంతో అట్టుడికిపోయిన ఈశాన్య రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ గురువారం సాయంత్రం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

మణిపూర్ లో అధికార పార్టీగా బీజేపీనే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. రెండు రోజుల క్రితం సీఎంగా ఉన్న బీజేపీ సీనియర్ నేత బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. తదనంతరం రెండు రోజులకే కేంద్ర ప్రభుత్వం మణిపూర్ లో రాష్ట్రపతి పాలనను విధిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.



2లో

## మొదటి భార్య ఫిర్యాదు.. పౌరసరఫరాల శాఖ మంత్రికి సమన్లు

ముంబై,: మహారాష్ట్రలోని బీడ్ కోర్టు ఆ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ధనంజయ్ ముండేకు నోటీసులు జారీ చేసింది. మొదటి భార్య కరుణ ముండే ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆ నోటీసులు జారీ చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను వెల్లడించలేదని మంత్రిపై మొదటి భార్య కరుణ ఫిర్యాదు చేసింది



2లో

## టెన్త్‌లో 10 జీపీఏ సాధిస్తే విమానం ఎక్కిస్తా..
### కలెక్టర్ బంపర్ ఆఫర్



"ఎగ్జామ్స్‌లో ఫస్ట్ ర్యాంక్ వస్తే సైకిల్ కొనిస్తా..", "పరీక్షల్లో మంచి మార్కులు వస్తే నీకు ఇష్టమైన ప్లే స్టేషన్ ఇప్పిస్తా.." పరీక్షల సమయంలో పిల్లలకు పేరెంట్స్ ఇలాంటి రకరకాల ఆఫర్లు ఇస్తూ ఉంటారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు, ఎంసెట్ రాసే అభ్యర్థులకు తల్లిదండ్రులు ఇలాంటివి చాలానే చెప్తుంటారు. అయితే.. పిల్లలు శ్రద్ధగా చదువుకుని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలనే వాళ్ల తాపత్రయం అంతా. కేవలం పేరెంట్సే కాదు..

2లో

## సర్వే పేరుతో పట్టపగలే దోపిడీ



2లో

తెలంగాణలోని గ్రామాల్లో మొన్నటి వరకు అధికారులు సర్వేలు నిర్వహించారు. నవంబర్ 9వ తేదీన తెలంగాణలో కులగణన సర్వే నిర్వహించగా.. ఆ తర్వాత జనవరిలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించిన అర్హులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేలు నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే.. మళ్లీ ఫిబ్రవరి 16 నుంచి 18వ తేదీ వరకు కులగణన సర్వే నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# రేవంత్‌ను దించేందుకు
## 25 మంది ఎమ్మెల్యేలు 'హస్తం' కలిపారు
### - ఎర్రబెల్లి దయాకర్ రావు



తెలంగాణ రాజకీయాల్లో రోజు రోజుకు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఏ నేత ఎప్పుడు ఏం బాంబు పేల్చుతారన్నది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠగా మారింది. ఇప్పటికే అధికార ప్రతిపక్ష నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్న నేపథ్యంలో.. ఎప్పుడు ఏం జరుగుతుందన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం (ఫిబ్రవరి 13న) రోజున మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్ రావు.. షాకింగ్ కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దించేందుకు కుట్ర జరుగుతోందని.. ఇందుకోసం 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కటయ్యారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది.. కాంగ్రెస్ సర్కార్ కూలిపోయేందుకు ఒక సంకేతమంటూ చెప్పుకొచ్చారు.

2లో

## మహిళా పోలీసులపై లైంగిక వేధింపులు..
### పోలీస్ ఉన్నతాధికారి సస్పెండ్

చెన్నై: తమపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు మహిళా పోలీసులు ఫిర్యాదు చేశారు. దీంతో అంతర్గతంగా దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పోలీస్ ఉన్నతాధికారిని సస్పెండ్ చేశారు.



2లో

## పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 90 మంది

2లో

## విద్యార్థినుల నిరసన
### » కాంగ్రెస్ 420 హామీలపై ప్రియాంక గాంధీకి పోస్టుకార్డులు



కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థినులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అమ్మాయిలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ 420 హామీలపై విద్యార్థినులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచినప్పటికీ.. ఏ ఒక్క హామీ అమలు కాలేదంటూ.. ఎంపీ ప్రియాంక గాంధీకి విద్యార్థినులు వినూత్నంగా లేఖలు రాశారు. ఈ కార్యక్రమం తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతోంది.

2లో

## దూరవిద్య ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం




2లో

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంబీఏ కోర్సు పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నేటిమాట

"నిజమైన తెలివితేటలు ఊహా శక్తిలో ఉంటాయి, జ్ఞాపకశక్తిలో కాదు. తప్పులు చేయడాన్ని భయపడకండి, ఎందుకంటే అవే మీకు కొత్త విషయాలు నేర్పిస్తాయి. ప్రశ్నలు అడగడం ఆపివేస్తే, నేర్చుకోవడం ఆగిపోతుంది."



-అల్బర్ట్ ఐన్‌స్టీన్

## కేసీఆర్ అధ్యక్షతన 19న
### బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం



2లో

ఈ నెల 19వ తేదీన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. 19న మధ్యాహ్నం ఒంటిగంట నుంచి హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో విస్తృత స్థాయి సమావేశం జరుగనున్నది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, మాజీ కార్పోరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు హాజరుకానున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.

# హరీష్ రావు పాదయాత్ర?

## తెలిసి తెలిసి ప్రభుత్వంపై జనాల వ్యతిరేకతను రేవంత్ కోరుకుంటారా ?

మొదటి పేజీ తరువాయి

కాబట్టి వేసవికాలం అయిపోయిన జూన్ తర్వాత వర్షాలు మొదలయ్యే కాలం కాబట్టి వాతావరణం కూడా సానుకూలంగానే ఉంటుందని అనుకోవాలి. వర్షాలు పడకపోయినా ఎండలైతే తగ్గిపోతాయి. అప్పుడు ఎన్నికల నిర్వహణకు అనువైన సమయంగా ప్రభుత్వం ఆలోచిస్తోందని సమాచారం.

ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటే హరీష్ తన పాదయాత్రను ఈనెలలోనే మొదలుపెట్టేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలాగూ హరీష్ పాదయాత్ర వారంరోజుల్లోపే పూర్తవుతుంది. సంగమేశ్వ, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి కేసీఆర్ 2022, ఫిబ్రవరి 21వ తేదీన శంకుస్థాపన చేశారు. భూసర్వే కూడా జరిగిన తర్వాత నిర్మాణపనులు నిలిచిపోయాయి. 2023 డిసెంబర్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా పై రెండు ప్రాజెక్టుల పనులు మొదలుకాలేదు. ఝురాసంగం మండలం కేతకి సంగమేశ్వర ఆలయం నుండి పాదయాత్ర ప్రారంభించి నారాయణఖేడ్ లోని బసవేశ్వర విగ్రహం దగ్గర పాదయాత్రను ముగించాలని హరీష్ ప్లాన్ చేస్తున్నారు.

పై రెండుప్రాంతాల మధ్య దూరం 130 కిలోమీటర్లు. రోజుకు15-20 కిలోమీటర్లు నడిచినా ఆరు లేదా ఏడురోజుల్లో పాదయాత్ర పూర్తయిపోతుంది. సంగారెడ్డి జిల్లాలోని ఆంథోల్, నారాయణఖేడ్, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని 397 గ్రామాల్లో 4 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు పై రెండు ప్రాజెక్టులను కేసీఆర్ టేకప్ చేశారు. పాదయాత్ర చేయటం ద్వారా పై నాలుగు నియోజకవర్గాల్లోని జనాల మద్దతు కూడగట్టుకోవాలని, ప్రభుత్వంపై బాగా ఒత్తిడితేవాలన్నది హరీష్ అసలు ఉద్దేశ్యం. ఇపుడు చేయబోయే పాదయాత్ర భవిష్యత్తులో జరగబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకు ఉపయోగపడుతుందని హరీష్ భావిస్తున్నారు. మరి పాదయాత్ర తేదీలను హరీష్ ఎప్పుడు ప్రకటిస్తారు ? స్థానికసంస్థల ఎన్నికల్లో హరీష్ అనుకుంటున్నట్లు బీఆర్ఎస్ కు ఎంతవరకు ఉపయోగపడుతుందో చూడాల్సిందే.

# సర్వే పేరుతో పట్టపగలే దోపిడీ

మొదటి పేజీ తరువాయి

మొదట నిర్వహించిన కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మళ్లీ ఈ సర్వే నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అయితే.. ఈ సర్వేలను కొంత మంది దుండగులు రకరకాలుగా వాడుకుంటున్నారు. గ్రామాల్లో అమాయకులను సర్వేల పేరుతో నిలువునా మోసం చేస్తున్నారు. అచ్చంగా అలాంటి ఘటనే ఖమ్మం జిల్లాలో మరొకటి వెలుగుచూసింది.

సర్వే పేరు చెప్పి ఇంటికి వచ్చి.. అన్ని వ్యక్తిగత వివరాలు తీసుకుని.. ఫోన్‌కు ఓటీపీ వస్తుందని అది చెప్పాలంటూ తీసుకుని.. కొంత మంది ఖాతాలు ఖాళీ చేస్తుంటే.. మరికొందరు ఒంటరిగా ఉన్నవారిపై దాడి చేసి ఇండ్లు గుల్ల చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. వైరా మున్సిపాలిటీ సుందరయ్యనగర్‌లో శీలం యుగంధర్ రెడ్డి ఇంటి వద్దకు పట్టపగలే కారులో నలుగురు దుండగులు వచ్చారు. సర్వేకి వచ్చామని తలుపు కొట్టారు. దీంతో.. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు వెంకట రామమ్మ (65) తలుపులు తీసింది. వాళ్లు నిజంగానే సర్వే కోసం వచ్చారనుకుని.. కూర్చోమ్మని చెప్పింది.

ఇంకేముంది.. కుర్చీల్లో కూర్చుని వెంకట రామమ్మను సర్వే పేరుతో వివరాలు అడుగసాగారు. ఆమె కూడా వాళ్లు అడిగిన ప్రశ్నలకు వివరాలు చెప్తూనే ఉంది. ఈ క్రమంలో.. లోపల ఎవరూ లేరని నిర్ధారించుకుని.. బయట కూడా ఎవరూ లేనప్పుడు చూసి.. సిగ్నల్ ఇచ్చుకున్నారు. అప్పటి వరకు ప్రొఫేషనల్‌గా ప్రశ్నలు అడిగిన ఆ నలుగురు.. క్షణాల్లోనే ఆ వృద్ధురాలి కాళ్లు చేతులు కట్టేశారు. అరిచేందుకు ఏమాత్రం స్పేస్ ఇవ్వకుండా నోటికి ప్లాస్టర్ వేసేశారు. ఇంకేముంది.. వచ్చిన పని మొదలుపెట్టేశారు. ఇంట్లో బీరువాలో ఉన్న రూ.15 లక్షల విలువైన 18 తులాల బంగారు ఆభరణాలు తీసుకుని.. నిమిషాల్లోనే బయటకొచ్చి కారులో పరారయ్యారు.

అయితే.. వెంకట రామమ్మ కుమారుడు శీలం యుగంధర్ రెడ్డి ఉద్యోగరీత్యా కొత్తగూడెం వెళ్లాడు. కోడలు ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. కాగా.. రోజూ మధ్యాహ్నం సమయంలో వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగానే ఉంటోందని ముందుగానే గమనించిన దుండగులు.. ప్లాన్ చేసి మరీ చోరీకి తెగబడ్డారు.

అయితే.. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చిన కోడలు.. దొంగతనం ఘటన తెలుసుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. త్వరలోనే దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

# విద్యార్థినుల నిరసన

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. విద్యార్థినులకు తప్పకుండా స్కూటీలు ఇస్తామని ప్రియాంక గాంధీతో సభల్లో చెప్పించారని విద్యార్థినులు గుర్తించారు. ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీ మేరకు తమకు ఎప్పుడు స్కూటీలు ఇస్తారంటూ.. ప్రియాంక గాంధీకి పలు కాలేజీల విద్యార్థినులు పోస్టు కార్డులు రాశారు. గద్దెనెక్కి ఏడాదైనా.. స్కూటీలు ఇవ్వకుండా మోసం చేయడంతో రేవంత్ సర్కార్‌పై విద్యార్థినులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధింపు

మొదటి పేజీ తరువాయి

వాస్తవానికి మణిపూర్ లో జాతుల వైరం నేపథ్యంలో గత కొంత కాలంగా అట్టుడుకుతోంది. పదుల సంఖ్యలో జనాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధుల మీద కూడా అక్కడ దాడులు జరిగాయి.

మొత్తంగా అక్కడి పరిస్థితులు దారుణ స్థితికి అద్దంగా నిలిచాయి. అయినా కూడా ప్రధాని నరేంద్ర మోదీ గానీ, ఇతర కేంద్ర మంత్రులు గానీ%ా% మణిపూర్ హింసపై నోరే మెదపలేదని విపక్షాలు గగ్గోలు పెట్టాయి. మణిపూర్ లో బీజేపీ సీఎం రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేశాయి.

విపక్షాల ఆరోపణలు తనకు ఎంతమాత్రం వినిపించలేదన్న ధోరణిలో సాగిన బీజేపీ ఢిల్లీ ఎన్నికలు ముగిసే దాకా సైలెంట్ గానే సాగింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాదించినంతనే మణిపూర్ అంశంపై దృష్టి సారించిన బీజేపీ అగ్ర నేతలు%ా% బీరేన్ సింగ్ తో రాజీనామా చేయించారని తెలుస్తోంది.

రాజీనామాకు ముందు ఢిల్లీ వెళ్లి బీజేపీ అగ్రనేతలను కలిసిన సంగతి తెలిసిందే. తాజాగా మణిపూర్ లో రాష్ట్రపతి పాలనను విధించిన కేంద్రం%ా% అక్కడి పరిస్థితులను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చిన తర్వాతే కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై దృష్టి సారించనుందన్న దిశగా విశ్లేషణలు సాగుతున్నాయి.

# టెన్త్‌లో 10 జీపీఏ సాధిస్తే విమానం ఎక్కిస్తా..

## కలెక్టర్ బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి



స్కూల్‌లోనూ మంచి మార్కులు తెచ్చుకున్నవారికి బహుమతులు ఇస్తూ వారిని ఎంకరేజ్ చేస్తుంటారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు కూడా పదో తరగతి విద్యార్థులకు బహుమతుల రూపంలోనో, నగదు రూపంలోనో రకరకాల ప్రోత్సాహకాలు ఇస్తుంటారు. ఆ ప్రోత్సాహకాలు అందుకునేందుకైనా.. పిల్లలు పోటీ పడి చదువుకుంటారని, పిల్లల్లో పోటీతత్వం పెరుగుతుందనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

ఈ క్రమంలో.. నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కూడా పదో తరగతి విద్యార్థుల్లో.. పోటీ పెంచి మంచి ఫలితాలు సాధించాలన్న ఉత్సాహాన్ని పెంచేందుకు అదిరిపోయే ఆఫర్ ఇచ్చారు. పదో తరగతి ఫలితాల్లో పదికి పది జీపీఏ సాధిస్తే విమానం ఎక్కిస్తానంటూ బంపర్ ఆఫర్ ఇచ్చారు. బుధవారం (ఫిబ్రవరి 12) రోజున రాత్రి.. నల్గొండ జిల్లాలోని కనగల్ కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, హాస్టల్ రూంలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు.

ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఇలా త్రిపాఠి.. పబ్లిక్ పరీక్షలకు బాగా చదువుకోవాలని సూచించారు. మంచి మార్కులు తెచ్చుకుంటే విమానం ఎక్కే అవకాశం కల్పిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. తర్వాత విద్యార్థినులతో కలిసి సెల్ఫీ దిగారు. కలెక్టర్‌తో పాటు ఎంఈవో వసుమలత, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు ఉన్నారు.

### వేకప్ కాల్‌తో యాదాద్రి కలెక్టర్..

ఈ క్రమంలోనే.. పదో తరగతి విద్యార్థుల కోసం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు కూడా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో వేకప్ కాల్ అనే కార్యక్రమంతో.. ఆయా గ్రామాల్లో నిరుపేదలుగా ఉన్న మెరుగైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఇందుకోసం వేకువజామునే 5 గంటలకు విద్యార్థుల ఇండ్లకు స్వయంగా వెళ్లి తలుపుతట్టి లేపి మరీ.. బాగా చదువుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. తన సొంత డబ్బులను ప్రోత్సాహకంగా ఇస్తూ.. స్టడీ ఛైర్, పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్స్ లాంటివి అందిస్తూ.. విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ.. పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు హనుమంతరావు.

# దూరవిద్య ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్కు రూ.10,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# రేవంత్‌ను దించేందుకు

## 25 మంది ఎమ్మెల్యేలు 'హస్తం' కలిపారు

### - ఎర్రబెల్లి దయాకర్ రావు

మొదటి పేజీ తరువాయి

మరోవైపు.. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కార్ స్థానిక ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తోందని ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పే మాటలకు చేసే పనులకు ఏమాత్రం సంబంధం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా అప్పాయింట్మెంట్ ఇచ్చే పరిస్థితి లేదంటూ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలన గురించి తెలిసే రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అబద్ధాలమయమని విమర్శించిన ఎర్రబెల్లి దయాకర్ రావు.. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామనే భావనలో తెలంగాణ ప్రజలు ఉన్నారని.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా.. బీఆర్ఎస్ పార్టీ వంద సీట్లు గెలుస్తుందంటూ ఎర్రబెల్లి దయాకర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క కార్యకర్త ధైర్యంగా ముందుకెళ్లాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయమని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఎవ్వరూ భయపడొద్దని.. ఏ కష్టం వచ్చిన తానున్నానని భరోసా ఇచ్చారు. ఎన్ని కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదని ధైర్యం నింపారు.

కనీసం సాగు నీళ్లు అందియలేని స్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని ఎర్రబెల్లి దయాకర్ రావు దుయ్యబట్టారు. కర్కాల బ్రిడ్జి ఎందుకు ఆగిపోయిందని ప్రభుత్వాన్ని ఎర్రబెల్లి ప్రశ్నించారు. తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి ఎటు పోయిందని నిలదీశారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ ఎటు పోయాయని అడిగారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పటికి ఇంకా అబద్ధాలతోనే కాలం వెలదీస్తుందని ఎర్రబెల్లి దుయ్యబట్టారు.

# మహిళా పోలీసులపై లైంగిక వేధింపులు..

## పోలీస్ ఉన్నతాధికారి సస్పెండ్

మొదటి పేజీ తరువాయి

తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ సంఘటన జరిగింది. ఐపీఎస్ అధికారి డీ మగేష్ కుమార్, 2024 డిసెంబర్ వరకు గ్రేటర్ చెన్నై ట్రాఫిక్, సౌత్ డీఐజీ, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేశారు. ఆ తర్వాత గ్రేటర్ చెన్నై ట్రాఫిక్, నార్త్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా నియమితులయ్యారు.

కాగా, పోలీస్ అధికారి మగేష్ కుమార్ కింద పనిచేసిన మహిళా ట్రాఫిక్ పోలీసులను ఆయన లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇద్దరు మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు డీజీపీ, పోలీస్ ఫోర్స్ హెడ్ శంకర్ జివాల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను రిజర్వ్ కేటగిరీ కింద ఉంచారు. లైంగిక వేధింపులపై వచ్చిన ఫిర్యాదులను అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)కి పంపారు. మరోవైపు దర్యాప్తు తర్వాత మగేష్ కుమార్‌పై చర్యల కోసం డీజీపీకి సిఫార్సు చేశారు. దీంతో డీజీపీ ఆదేశాల ఆధారంగా ఆయనను హోం శాఖ సస్పెండ్ చేసింది. తీవ్రమైన అభియోగాల దృష్ట్యా మగేష్ కుమార్ క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని పోలీస్ వర్గాలు తెలిపాయి.



# మొదటి భార్య ఫిర్యాదు.. పౌరసరఫరాల శాఖ మంత్రికి సమన్లు

పర్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ధనంజయ్ ముండే తన ఎన్నికల అఫిడవిట్‌లో భార్య రాజశ్రీ ముండే, ఆమె ముగ్గురు కుమార్తెలు, ఇంకా తన ఇద్దరి పిల్లల గురించి ప్రస్తావన చేశారని కరుణ తరపు లాయర్ చంద్రకాంత్ తోంబ్రే తెలిపారు. అయితే తన ఆధీనంలో ఉన్న ఆస్తులను ఆ నామినేషన్ పేపర్లలో వెల్లడించలేదని కరుణ ముండే ఆరోపించారు. ప్రజాప్రతినిధుల చట్టంలోని 33ఏ, 125ఏ కింద ఆమె తొలుత ఆన్‌లైన్‌లో ఫిర్యాదు ఇచ్చింది. 33ఏ ప్రకారం నిజమైన సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ సమాచారాన్ని దాచిపెడితే 125ఏ ప్రకారం ఆర్నెళ్ల జైలు శిక్ష ఉంటుంది.

డాక్యుమెంట్లను పరిశీలించిన మెజిస్ట్రేట్.. పౌరసరఫరాల శాఖ మంత్రికి సమన్లు ఇచ్చారు. ఇప్పటికే ఓ సర్పంచ్ హత్య కేసులో మంత్రి ముండే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కరుణ ముండేను వేధించిన కేసులో ఇటీవల కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. మెయింటేనెన్స్ కింద ప్రతినెల రెండు లక్షలు చెల్లించాలని ఆదేశించింది.

# కేసీఆర్ అధ్యక్షతన 19న

## బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం


మొదటి పేజీ తరువాయి



ప్రత్యేక సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర నిర్మాణాత్మక అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించనున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రధానంగా చర్చ జరుగుతుందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించేందుకు.. తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం కార్యకర్తలు శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ విస్తృతస్థాయి సమీక్షా సమావేశంలో చర్చించనున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు ప్రత్యేక సమావేశంలో తీసుకుంటారని.. తప్పనిసరిగా భేటీకి నేతలు రావాలని కేటీఆర్ కోరారు.

# పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 90 మంది

హైదరాబాద్ : రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాలలో నామినేషన్ల ఉపసంహరణ గడువు తేదీ గురువారంతో ముగిసింది. దీంతో మొత్తం కరీంనగర్ (గ్రాడ్యుయేట్, టీచర్), నల్లగొండ టీచర్ నియోజక వర్గాల నుంచి మొత్తం 90 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తెలంగాణ సీఈవో సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. అలాగే కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 68 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఉండగా.. వారిలో 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. దీంతో ఆ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం 56 మంది ఎన్నికల బరిలో నిలిచారు. అలాగే కరీంనగర్ టీచర్ నియోజకవర్గం నుంచి 16 మంది అభ్యర్థులు అర్హత సాధించగా.. వారిలో ఒక్కరు తమ నామినేషన్ వెనక్కి తీసుకోవడంతో 15 మంది బరిలో ఉన్నారు. నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ నియోజక వర్గం నుంచి 21 మంది అభ్యర్థులకు అర్హులుగా పరిగణించగా.. వారిలో 3 నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం 19 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నట్లు సీఈవో పేర్కొన్నారు.



# ఓయూ పరిధిలో బీ-ఫార్మసీ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడు, ఐదు, ఏడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

## యూత్ కాంగ్రెస్ స్టేట్ ప్రెసిడెంట్ జక్కిడి శివ చరణ్ రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం విజయవంతం చేయండి. ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు వేజెండ్ల సాయి కుమార్.



ఖమ్మం,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఫిబ్రవరి 14 వ తారీకు ఉదయం 10 గంటలకి గాంధీ భవన్ నందు తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం, చేయాలని ఖమ్మం జిల్లా సంజీవరెడ్డి భవనంలో జరిగిన సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు కోరారు. ఖమ్మం నుండి యువజన కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, ఉప ముఖ్యమంత్రివర్యులు, పీసీసీ అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు వేజెండ్ల సాయి కుమార్ పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు బోడెపూడి రాజా, ఖలీల్, క్రాంతికుమార్, నవాజ్, బాణావత్ కోటేష్, శ్రావణ్, ఆర్కే నాయుడు, ఇజ్జగాని సత్యం, కాటబత్తిని ఆర్కే, వీర బత్తుల, వీరారెడ్డి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లీడి నర్సయ్యకు ఘన నివాళులు అర్పించిన మాజీ ఎంపీ నామ





ఖమ్మం,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ నాయకులు, కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామ వాస్తవ్యులు మల్లీడి వెంకటేశ్వరరావు (వెంకన్న) తండ్రి నర్సయ్య ఇటీవల మరణించిన విషయం విధితమే కాగా ఆయన దశ దిన కర్మ గురువారం నాడు చేగొమ్మ గ్రామంలోని వారి స్వగృహం నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మల్లీడి కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొని నర్సయ్య చిత్ర పటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మల్లీడి వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నామ క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్, బిఆర్ఎస్ నాయకులు కనకమేడల సత్యనారాయణ, కూసుమంచి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా, ఖమ్మం రూరల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు గోపాల్, ఖమ్మం రూరల్ మాజీ జడ్పీటీసీ వరప్రసాద్, ముదిగొండ మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, కూసుమంచి మండల మాజీ సర్పంచ్ లు కొండపల్లి వెంకటేశ్వర్లు, బిక్యా నాయక్, కిషన్ నాయక్, శ్రీను నాయక్ ల తో పాటు బానోతు బాలకృష్ణ, తంగెళ్ల బుచ్చిబాబు, వైరా రూరల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, గోడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాద్ రావు, కోటేశ్వర రావు, మహిళా నాయకురాలు అలివేలమ్మ, నామ సేవ సమితి సభ్యులు తాళ్లూరి హరీష్, రేగళ్ళ కృష్ణ ప్రసాద్ (కేపి), కంచర్ల నాగేశ్వరరావు, సింగవరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రిమినల్ చట్టలున్నా అమలులో తాచ్చారం



హుస్నాబాద్, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): :ప్రభుత్వల వైఫల్యం వల్లే ప్రజలకు అన్యాయం విలేఖరుల సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూదేశంలో పరిపాలకులు సగానికి పైగా ప్రజల ఓట్లతో గెలిచాక ప్రజా గొడు పట్టని వాళ్ళు ఉండటం వల్ల ప్రజలు నష్ట పోతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు నేడు హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధికారులను పాలకులు పని చేయనివ్వడం లేదని అనేక క్రిమినల్ చట్టాలు ఉన్నాప్పటికి పాలకుల పనితీరు వల్ల చట్టలు అమలులో నిర్లక్ష్యం చేయడంతో ప్రజలకు అన్యాయం జరుగుతోందని చాడ వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారుపార్లమెంటులో ఉన్న ప్రజా ప్రతినిధులు సగానికి పైగా నేరచరిత్ర ఉన్న వాళ్లే ఉన్నారని వారి మూలంగానే ప్రభుత్వ అధికారులు చట్టాలను అమలు చేయకుండా సరిగ్గా పని పని చేయడం లేదని అందువల్లే ప్రజలకు అన్యాయం జరుగుతుందని చాడ వెంకటరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు దేశంలో నరేంద్ర మోడీ కొత్త చట్టాలు తీసుకోచ్చి ప్రజలకు మేలు చేస్తారని ప్రజలకు ఏమాత్రం నమ్మకం లేదని ఆయన అన్నారు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నన భోజనం చేస్తున్న వంట మనుషు లైన పేదలకు నెల నెలా బిల్లులు అంతే కాకుండా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని భారత రాజ్యాంగం ప్రకారం కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎందుకని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించి ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారుసంక్షేమ పథకాల ఏర చూపి ప్రజలను ఆకర్షించడానికి అనేక వాగ్దానాలు చేసి అమలులో పాలకులు వైఫల్యం చెందడం వల్ల ప్రజలు నష్ట పోతున్నారని పాలకులను చాడ వెంకటరెడ్డి ప్రశ్నించారురానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సిట్లు గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త నాయకులు నిర్విరామంగా కృషి చేయాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బొయిని అశోక్సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీర్ సత్య నారాయణ యెడల వనేష్ అక్కన్నపెట కోహెడ మండలాల సిపిఐ కార్యదర్శులు కొమ్ముల భాస్కర్ ముంజ గోపి సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి ఎగ్గోజు సుదర్శన్ బొజ్జపురి రాజు భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెరిపోతులజనార్ధన్ రైతుసంఘంనా యకులు జంగ విజయ కాల్వల ఎల్లయ్య సిపిఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి పొదిల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ చర్యలు-పోలీస్ కమిషనర్






ఖమ్మం, 13 ఫిబ్రవరి( క్రాంతిన్యూస్ ): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల కట్టడికి తీసుకుంటున్న ప్రత్యేక చర్యలలో భాగంగా వేగాన్ని నియంత్రించేందుకు150 సోలార్ బ్లింకింగ్ బారికేడ్స్, అదేవిధంగా పోలీస్ శాఖలో ఎవిడెన్స్ ఆధారిత పోలీసింగ్ కోసం ప్రతి పోలీస్ స్టేషన్ కు కొత్తగా రెండు కంప్యూటర్ ట్యాబ్‌లను అందజేశారు. 10 డిజిటల్ కెమెరాలు, 27 బ్రీత్ ఎనలైజర్, 60 కంప్యూటర్ ట్యాబ్‌లు, 02 స్పీడ్ లేజర్ గన్స్, ఇతర పరికరాల తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్లో అందుబాటులో తీసుకొచ్చినట్లు తెలిపారు.ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణకు సోలార్ బ్లింకింగ్ బారికేడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు నిరంతరం డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాని,పోలీస్ అధికారులకు ఆదేశించిట్లు తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుండి తప్పించుకోకుండా పోలీస్ శాఖలో ఎవిడెన్స్ ఆధారిత పోలీసింగ్ లో భాగంగా కేసుల విచారణ, డయల్ 100 కాల్స్ స్పందనతో పాటు వీడియో, ఫోటోగ్రాఫీ ఎవిడెన్స్ వచ్చే విధంగా ప్రతి పోలీస్ స్టేషన్ కు కొత్తగా రెండు కంప్యూటర్ ట్యాబ్ లు అంజేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా వేసేందుకు డిజిటల్ కెమెరాలు ఉపయోగించాలని పోలీస్ అధికారులు సూచించారు. రహదారులపై వేగంగా దూసుకెళ్తున వాహనాలను కట్టడి చేసేందుకు స్పీడ్ లేజర్ గన్స్ ను ఖమ్మం రూరల్ ,వైరా డివిజన్ ప్రాంతాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు, ఇతర వాహనచోదకులు సీటు బెల్టు ధరించాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దన్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తూ,అసాంఘిక కార్యాకాలపాలు, నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల కట్టడికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## పాల్వంచలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన



పాల్వంచ, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్వంచ పట్టణంలో గురువారం పర్యటించారు. పర్యటనలో భాగంగా స్థానికంగా ఉన్న పెద్దమ్మతల్లి ఆలయాన్ని, శివాలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. అదేవిధంగా స్థానిక ఫంక్షన్ హాల్లో జరిగిన బత్తుల అంజి సోదరుని కుమారుని వివాహానికి హాజరయ్యారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఇటీవల వివాహం జరిగిన నవీన్ దంపతులను కేశవాపురంలోని వారి ఇంటి వద్ద ఆశీర్వదించి పట్టు వస్త్రాలను కానుకగా అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన చీకటి కార్తీక్ గాంధీ భవన్ లో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసేందుకు వెళ్తూ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన టీం ఆధ్వర్యంలో మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. పలు ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, జారే ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

## గురుకుల పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం



ఇనుగుర్తి, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో స్వతంత్ర సమరయోధురాలు, భారత కోకిల సరోజినీ దేవి పుట్టినరోజు సందర్భంగా ఆంగ్ల భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆంగ్లంలో వ్యాసరచన, స్పీచ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు ఆశ, హర్షిత, ప్రత్యూష, సురేష్, రవీందర్, పావని విద్యార్థులు పాల్గొన్నారు.

## సమ్మక్క,సారక్క వనదేవతలను దర్శించుకున్న జిల్లా కలెక్టర్.



ఖమ్మం, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఖమ్మం కాలవడు మున్నేరు ప్రాంతం లో గల శ్రీశ్రీశ్రీ రేణక ఎల్లమ్మ దేవస్థానం లో పూజారి ఉప్పి స్వామి చౌదరి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సమ్మక్క,సారక్క మినీ జాతర మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గద్దె పైకెక్కిన వన దేవతమూర్తులు సమ్మక్క, సారక్క లను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ దర్శించుకుని అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు . సమ్మక్క సారక్క మినీ జాతరలో భాగంగా మహా అన్నదాన కార్యక్రమము నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. సుమారుగా 3000 మంది భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాళ్ళం సతీష్, మాటేటి రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన అతిథులను శాలువలతో సత్కరించారు.

## మా భూములను కాపాడండి సారూ



నేలకొండపల్లి,13 ఫిబ్రవరి(క్రాంతిన్యూస్):ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని అప్పలనరసింహాపురంలో ఐరన్ ఫ్యాక్టరీ వలన వ్యవసాయ సాగుకు భూములు పనికి రాకుండా పోతున్నాయని రైతులు వాపోయారు. గ్రామానికి చెందిన బాధిత రైతులు గురువారం హైద్రాబాద్ లోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కలిసి ఫ్యాక్టరీ పై ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ వలన రైతులు పడుతున్న బాధలను అధికారులకు వివరించారు. విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బాధిత రైతులు పేర్కోన్నారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడారు.ఫ్యాక్టరీ వలన పంటలు దెబ్బతింటున్నాయని వాపోయారు. పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు వ్యవసాయం సాగు చేయకుండా భూములు వదిలేసే పరిస్థితులు నెలకొల్పుతున్నారని దెబ్బతింటున్నాయని వాపోయారు. పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు వ్యవసాయం సాగు చేయకుండా భూములు వదిలేసే పరిస్థితులు నెలకొల్పుతున్నారని అన్నారు. తమకు న్యాయం చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అధికారులను కలిసిన వారిలో బాధిత రైతులు అంజిబాబు, వెంకటనారాయణ, శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# టీడీపీలోకి మాజీ మంత్రి ఆళ్ల నాని..

## - ఎట్టకేలకు ముహూర్తం ఫిక్స్!



వైసీపీకి గుడ్‌బై చెప్పిన మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని.. టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన ఆళ్ల నాని.. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. అయితే గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీతోపాటు ఆయన కూడా ఘోర పరాజయం పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల తర్వాత నుంచి వైసీపీకి దూరంగా ఉన్న ఆళ్ల నాని.. ఎట్టకేలకు గతేడాది చివర్లోనే వైసీపీకి గుడ్‌బై చెబుతూ పార్టీకి.. ఏలూరు జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరనున్నట్లు విస్తృత ప్రచారం జరిగింది. అయితే ఆళ్ల నాని టీడీపీలో చేరడానికి స్థానిక నాయకత్వం అడ్డుపడినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన టీడీపీ కండువా కప్పుకోవడం కాస్త ఆలస్యం అయింది.

వైసీపీకి రాజీనామా చేసినప్పటి నుంచి అప్పుడప్పుడు ఆళ్ల నాని.. సైకిల్ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు వార్తలు రాగా.. అవన్నీ వాయిదా పడుతూనే వస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఆళ్ల నాని టీడీపీలో చేరేందుకు అధినేత నారా చంద్రబాబు నాయుడు నుం చి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ఆళ్ల నాని సైకిల్ ఎక్కేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అతి త్వరలోనే ఆళ్ల నాని.. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో పచ్చ కండువా కప్పుకోనున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

మరోవైపు.. ఇప్పటికే ఆళ్ల నాని టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఆళ్ల నాని 3 సార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి మంత్రిగా పనిచేశారు. అయితే వైసీపీకి రాజీనామా చేసిన వెంటనే టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేసినా అవి సఫలం కాలేదు. దీంతో చంద్రబాబు నాయుడు నుంచి పిలుపు వస్తుందని వేచి చూడగా.. తాజాగా ఆ సమయం రానే వచ్చినట్లు తెలుస్తోంది. ఏలూరు నియోజకవర్గంతో పాటు బలమైన సామాజికవర్గం నేత తమకు అవసరం అని భావించిన టీడీపీ హైకమాండ్ ఆళ్ల నానిని పార్టీలో చేర్చుకునేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.

# వేలంలో రూ.41 కోట్లు పలికిన ఒంగోలు గిత్త..

## చంద్రబాబు రియాక్షన్ ఇదే..!





ఇటీవల ధర విషయంలో ఒంగోలు ఆవు ప్రపంచ రికార్డులను తిరగరాసిన విషయం తెలిసిందే. ఆ ఒంగోలు గిత్తకు వేలం నిర్వహించగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా రూ.41 కోట్లకు అమ్ముడుపోయింది. బ్రెజిల్‌లో నిర్వహించిన ఈ వేలంలో ఒంగోలు గిత్తకు భారీ ధర పలకడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఈ క్రమంలోనే తాజాగా బ్రెజిల్‌లో ఒంగోలు ఆవు రూ.41 కోట్లు పలకడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ప్రపంచ వేదికపై ఒంగోలు ఆవు సత్తా చాటిందని కొనియాడారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో ఒంగోలు ఆవు రూ.41 కోట్లు పలకడం సాధారణ విషయం కాదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశు సంవర్ధక వారసత్వం.. ప్రపంచ దేశాలకు తెలిసిందని చంద్రబాబు తెలిపారు. ఒంగోలు గిత్తలు ఉన్నత జన్యువులు, బలానికి ఎంతో ప్రసిద్ధి చెందాయని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఒంగోలు జాతి ఆవులను రక్షిస్తూ పాడి రైతులను ఆదుకోవడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తోందని వెల్లడించారు.

తెల్లటి శరీరం.. చలి, వేడిని తట్టుకునే తత్వం ఒంగోలు గిత్తల సొంతం. మూపురంతోనే చూపరులను ఆకట్టుకునే ఈ ఒంగోలు ఆవులు.. రంకెల్లో రాజసం కనిపిస్తూ ఉంటుంది. ఒంగోలు జాతి పశువుల పేరు చెప్పగానే జంతు ప్రేమికుల్లో తెలియని సంతోషం కనిపిస్తూ ఉంటుంది. ఈ ఒంగోలు గిత్తలకు పుట్టినిల్లు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కావడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఒంగోలు గిత్త కారణంగా.. ఆంధ్రప్రదేశ్ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోతోంది. బ్రెజిల్‌లో ఇటీవల నిర్వహించిన ఒక వేలంలో ఒంగోలు జాతికి చెందిన వియాటినా-19 అనే ఆవు ఏకంగా రూ.41 కోట్ల ధర పలికి.. ప్రపంచ రికార్డును సృష్టించింది.

ఈ ఒంగోలు ఆవులు చాలా పెద్దవిగాను, బలిష్టంగానూ ఉంటాయి. వీటికి చక్కగా మచ్చిక అయ్యే గుణం ఉంటుంగి. ఇక ఈ ఒంగోలు జాతి పశువులు మంచి ఎముక పుష్టిని కలిగి ఉండి.. ఏపుగా పెరుగుతాయి. ఆహారం, వాతావరణం, భూసారం అనుకూలించడంతో ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా తట్టుకుని నిలబడగలిగే రోగ నిరోధక శక్తి ఈ ఒంగోలు జాతి ఆవుల సొంతం. బరువులు లాగడం, పాల ఉత్పత్తులకు ప్రపంచంలో ఈ ఒంగోలు జాతి పశువులకు పోటీ మరో జాతి లేదని చెబుతారు. వ్యవసాయం చేయడంలో ఒంగోలు జాతి గిత్తలు బాగా పనిచేస్తాయని పేరు సంపాదించాయి.

# ఏపీలో ఓ వ్యక్తికి

## బర్డ్‌ఫ్లూ నిర్ధారణ..!


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కలకలం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో లక్షలాది కోళ్లు మృతి చెందుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఓ మనిషికి బర్డ్ ఫ్లూ వైరస్ సోకడం ప్రస్తుతం సంచలనం రేపుతోంది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలానికి చెందిన వ్యక్తికి బర్డ్ ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం ఆ వ్యక్తికి చికిత్స అందిస్తున్నారు. అయితే, ఈ విషయాన్ని వైద్యారోగ్య శాఖ అధికారులు ధృవీకరించాల్సి ఉంది.

కాగా, రెండు గోదావరి జిల్లాల పరిధిలో గత కొంత కాలంగా లక్షలాది కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమైన మృతి చెందిన కోళ్ల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపగా బర్డ్‌ఫ్లూగా తేలింది. తూర్పు గోదావరి జిల్లా కానూరు అగ్రహారం, వేల్పూరులోనూ ఓ కోళ్లను నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపగా.. బర్డ్‌ఫ్లూగా నిర్ధారణ అయ్యింది. ఈ క్రమంలో అధికారులు అగ్రహారం పరిధిలోని రెడ్‌జోన్‌గా ప్రకటించారు. మరో వైపు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయ్యిన ప్రాంతంలో చికెన్ దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.



# ఏపీలో మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకిందని వార్తలు..

## మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం



ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోంది. మరీ ముఖ్యంగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో బర్డ్ ఫ్లూతో లక్షల్లో కోళ్లు చనిపోయాయి. ఆ జిల్లాల్లో కోళ్లకు సంబంధించిన శాంపిల్స్ తీసి భోపాల్‌కు పంపించి.. అక్కడ ల్యాబ్‌లో పరీక్షలు చేయగా బర్డ్‌ఫ్లూ అని తేలింది. దీంతో ఆ జిల్లాల్లోని మిగిలిన కోళ్లు, కోడిగుడ్లను పూడ్చివేశారు. అయితే తాజాగా ఏలూరు జిల్లా ఉంగుటూరులో మనుషుల్లో బర్డ్‌ఫ్లూ గుర్తించారని వస్తున్న వార్తలపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవన్నీ తప్పుడు వార్తలు అని కొట్టిపారేశారు. బర్డ్‌ఫ్లూపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

చికెన్, గుడ్లు తినడానికి జనం భయపడుతున్నారన్న వార్తలపై మంత్రి స్పందించారు. బాగా ఉడికించిన చికెన్, గుడ్లను తింటే ఎలాంటి ప్రమాదం ఏమీ లేదని మంత్రి అచ్చెన్నాయుడు తేల్చి చెప్పారు. బర్డ్‌ఫ్లూపై నిత్యం సమీక్షలు జరుపుతున్నట్టు చెప్పారు. తాజాగా ఏపీ సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొన్ని పత్రికలు, మీడియా, సోషల్ మీడియా బర్డ్‌ఫ్లూ విషయంలో రాస్తున్న వార్తలు.. ప్రజల్లో తీవ్ర భయాందోళనలను గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. బర్డ్‌ఫ్లూ విషయంలో ప్రజలను భయాందోళనకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

తాజాగా ఉంగుటూరులో ఒకరికి బర్డ్‌ఫ్లూ సోకిందని ఒక పత్రికలో వార్త రాశారని.. ఇలాంటి తప్పుడు వార్తల కారణంగా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతారని మంత్రి తెలిపారు. బర్డ్‌ఫ్లూపై శాస్త్రవేత్తలు, కేంద్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చలు జరుపుతున్నారని వివరించారు. బర్డ్‌ఫ్లూపై కేంద్ర ప్రభుత్వం, శాస్త్రవేత్తలు ఇచ్చిన మార్గదర్శకాలను పాటిస్తున్నామనిని తెలిపారు.



# కాకినాడలో కేరళ సీబీఐ అధికారులు..

**-కాకినాడకు వచ్చిన సీబీఐ అధికారుల టీమ్**

**-2023 నుంచి ఆర్మీ అధికారి మిస్సింగ్ మిస్టరీ**

**-డెడ్‌బాడీని తీసి డీఎన్ఏ పరీక్షలకు పంపారు**



కేరళ సీబీఐ అధికారులు కాకినాడ వచ్చారు.. రెండేళ్ల క్రితం పూడ్చి పెట్టిన ఓ మృతదేహాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. అసలు ఏం జరిగిందని ఆరా తీస్తే అసలు సంగతి తెలిసింది. కేరళలోని పతనంతిట్ట జిల్లా కోడుమాన్‌కు చెందిన కె శశాంక్ మిలటరీలో ఎస్ఐ స్థాయి అధికారిగా ఉన్నారు.. అరుణాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. శశాంక్ 2023 ఆగస్టు 22న సెలవుపై ఇంటికి వెళ్లారు.. సెలవుల్ని మరో 37 రోజులు పొడిగించుకోవాలని భావించారు. అదే ఏడాది అక్టోబర్ 19న తిరిగి విధులకు హాజరయ్యేందుకు వెళ్లారు. మళ్లీ 2023 నవంబర్‌లో అసోంలో గౌహతి ఎక్స్‌ప్రెస్ ఇంటికి బయల్దేరారు.

ఇంతలో ఏం జరిగిందో ఏమో.. 2023 నవంబరు 27వ తేదీన చెన్నై రైల్వేస్టేషన్ నుంచి శశాంక్ భార్య కుమారికి ఫోన్ వెళ్లింది. చెన్నై రైల్వే స్టేషన్ సమీపంలో లగేజీ బ్యాగ్ కనిపించిందని చెప్పారు. నవంబర్ 25 రాత్రి కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి జారిపడి ఒకరు చనిపోయారు.. ఈ ప్రమాదంపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మృతదేహాన్ని మూడు రోజుల పాటు కాకినాడ జీజీహెచ్ మార్చురీలో ఉంచగా.. అతడి వివరాల కోసం ఆరా తీసినా ఎలాంటి సమాచారం దొరకలేదు. దీంతో కాకినాడలోని శ్మశానవాటికలో మృతదేహాన్ని పూడ్చిపెట్టారు.

ఇంతలో శశాంక్ కుమారుడు శ్రీజిత్ ఫిర్యాదుతో కేరళ హైకోర్టు స్పందించింది.. శంకరన్ అదృశ్యం వెనుక మిస్టరీని కనిపెట్టాలని ఈ కేసును సీబీఐకి అప్పగించింది. 2024 డిసెంబరు 5వ తేదీ నుంచి సీబీఐ చేపట్టింది.. అయితే కాకినాడలోని శ్మశానంలో పూడ్చి పెట్టింది శశాంక్ మృతదేహమనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో సీబీఐ వివరాలను ఆరా తీసి.. నలుగురు అధికారుల టీమ్ కాకినాడ వచ్చింది. కాకినాడలోని శ్మశానంలో పూడ్చిపెట్టింది శంకరన్ మృతదేహమా కాదా అని గుర్తించేందుకు.. అర్బన్ ఎమ్మార్వో జితేంద్ర సమక్షంలో శశాంక్ డీఎన్ఏ కోసం తవ్వకాలు చేపట్టారు. అక్కడ శాంపిల్స్ సేకరించి డీఎన్ఏ పరీక్షల కోసం పంపించారు. ఆ రిపోర్టులు వస్తే కానీ శశాంక్ మిస్సింగ్ మిస్టరీ తేలేలా లేదు.

# పర్యాటకులకు గుడ్‌న్యూస్..

## చెన్నై-విశాఖ-పుదుచ్చేరిల మధ్య క్రూయిజ్ షిప్, షెడ్యూల్ ఇదే?

చెన్నై-విశాఖ-పుదుచ్చేరి మధ్య క్రూయిజ్ నౌక సర్వీసులు నడపనున్నారు. ఈ ఏడాది జూన్, జులై నెలల్లో పర్యాటకుల కోసం కార్డెలియా క్రూయిజ్ నౌక సర్వీసులు అందించనుంది. మొత్తంగా మూడు సర్వీసులు అందుబాటులో ఉండనున్నట్లు కార్డెలియా క్రూయిజ్ నౌక నిర్వాహకులు తాజాగా వెల్లడించారు. ఎప్పుడెప్పుడు ఎక్కడి నుంచి ఈ కార్డెలియా క్రూయిజ్ నౌక బయల్దేరుతుంది.. ఎప్పుడెప్పుడు, ఎక్కడికి అది ప్రయాణం చేస్తుంది అనే విషయాలను తెలిపారు. జూన్ 30వ తేదీన ఈ కార్డెలియా క్రూయిజ్ నౌక తొలి సర్వీసు ప్రారంభం కానుండగా.. జులై 19వ తేదీతో మూడు సర్వీసులు పూర్తి చేసుకోనుంది. అయితే టికెట్ ధర ఎంత ఉంటుంది అనే విషయాలు మాత్రం నిర్వాహకులు ఇంకా వెల్లడించలేదు.

మొదటి సర్వీసు జూన్ 30వ తేదీన చెన్నైలో ప్రారంభం కానుంది. అక్కడి నుంచి జులై 2వ తేదీ వరకు కార్డెలియా క్రూయిజ్ షిప్ విశాఖకు చేరుకోనుంది. అనంతరం జులై 2వ తేదీన విశాఖలో బయలుదేరి జులై 4వ తేదీన పుదుచ్చేరికి చేరనుంది. తిరుగు ప్రయాణంలో జులై 4వ తేదీన పుదుచ్చేరిలో బయలుదేరి.. ఆ తర్వాతి రోజు అంటే జులై 5వ తేదీన చెన్నైకి చేరుకుంటుంది.

కార్డెలియా క్రూయిజ్ షిప్ రెండో సర్వీస్ జులై 7వ తేదీన చెన్నైలో బయలుదేరనుంది. జులై 9వ తేదీ విశాఖకు చేరుకుని.. అక్కడి నుంచి జులై 11వ తేదీన పుదుచ్చేరికి చేరనుంది. అక్కడి నుంచి తిరుగురు ప్రయాణంలో జులై 12వ తేదీన చెన్నైకి వెళుతుంది.

మూడో సర్వీసు జులై 14వ తేదీన చెన్నైలో ప్రారంభం కానుంది. అక్కడి నుంచి జులై 16వ తేదీన విశాఖకు చేరుకుని.. అక్కడి నుంచి జులై 18వ తేదీన పుదుచ్చేరికి చేరనుంది. తిరుగు ప్రయాణంలో భాగంగా జులై 19వ తేదీన చెన్నైకి చేరుకోనుంది. విశాఖలో బుధవారం ట్రావెల్ ఏజెంట్లు నిర్వహించిన సమావేశంలో నిర్వాహకులు ఈ వివరాలను వెల్లడించారు. సముద్ర ప్రయాణాన్ని ఎంజాయ్ చేయాలని భావించే పర్యాటకుల కోసం ఈ సర్వీసులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఇక అతిపెద్ద క్రూయిజ్ నౌక కార్డెలియాలో సముద్రంలో ప్రయాణం చేసేందుకు అనేక మంది పర్యాటకులు ఆసక్తి చూపుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో విశాఖ తీరానికి చేరుకున్న క్రూయిజ్ నౌకలను చూసేందుకు భారీగా పర్యాటకులు ఎగబడి వచ్చిన విషయం తెలిసిందే.



# ఓంకార్, బి.ఎన్.రెడ్డి లాంటి బహిష్కృత నేతలే మాకు ఆదర్శం

## ఎం సి పి ఐ జాతీయ నాయకులు మోర్తాల చందర్ రావు




వరంగల్, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంసిపిఐ నుంచి బహిష్కరించిన చందర్ రావు ,సాంబయ్యలు ఓంకార్ పేరు ఎత్తడానికి అర్హులు కారని లక్షలాది రూపాయలు వసూలు చేసి దుర్వినియోగం చేశారని ఆరోపణ చేశారు దీనిని ఎంసిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని ప్రకటించినారు వరంగల్ పట్టణంలోని అబ్బనీ కుంట లో ఉన్న రైతు భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మోర్తాల చందర్ రావు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమాలలో నిత్యం ప్రజా సమస్యలతో ఉద్యమాలు నిర్వహించి ప్రజా నాయకులుగా వెలుగు వెలిగిన వారిని మెజార్టీ తీర్మానం అనే పేరుతో గ్రూపు రాజకీయాలు చేసి నాయకుల బహిష్కరణ పేరుతో మాస్ నాయకులను బహిష్కరించిన ఫలితంగానే 1964 నుండి నేటి వరకు ఈ 60 సంవత్సరాల కాలంలో సుమారుగా 80 కమ్యూనిస్టు పార్టీలు ఏర్పాటు అయ్యాయి అనే విషయం తెలియదా అందులో అతి ముఖ్యంగా ఓంకార్, బి ఎన్ రెడ్డి తరిమెల నాగిరెడ్డి ,చంద్ర పుల్లారెడ్డి, కొండపల్లి సీతారామయ్య, లాంటి మహానీయులే బహిష్కరణకు గురైన ఫలితంగా అనేక పార్టీలు పుట్టుక వచ్చిన దాంట్లో భాగంగానే ఎం సిపిఐ ఏర్పడినది ఓంకార్ గారిని బియన్ రెడ్డి ను ఆదర్శంగా తీసుకున్న మాకు బహిష్కరణలే వారసత్వంగా కాక మరేమీ వస్తాయి అని వారు అన్నారు ఎం సిపిఐ పార్టీ కార్యక్రమానికి తూట్లు పొడిచి ఎం సిపిఐ యు గా చలామణి అవుతున్న మీకు ఎం సిపిఐ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మండి పడ్డారు. లక్షలాది రూపాయలు వసూలు చేసిన మేము ఓంకార్ పేరును చిరస్థాయిగా నిలపాలని ఆసియా ఖండంలోని అతిపెద్ద స్థూపాన్ని కట్టించిన చరిత్ర మాకు ఉందని ఓంకార్ మాకే సొంతమని గొప్పలు చెప్పుకునే మీరు నేటి వరకు కనీసం స్థూపానికి రంగులు అయినా వేశారని వారిని ప్రశ్నించారు నర్సంపేటలో వరంగల్లో ఓంకార్ పేరునా విజ్ఞాన కేంద్రాన్ని, వెంకటరమణ జంక్షన్లో కాంస్య విగ్రహాన్ని పెడతామని చెప్పి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఆ డబ్బులను సొంత ప్రయోజనాలకు వాడుకున్న మీరు వారసులా లేక స్థూపం నిర్మాణం చేసిన నిజమైన వారసులము మేము లేక మీరా అనేది ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. ఓంకార్ స్తూపాన్ని ఆవిష్కరించిన సభలో ఓంకార్ సతీమణి అయిన లక్ష్మక్క మాట్లాడుతూ మాకు పిల్లలు ఎంతమంది ఉన్నా రాజకీయ వారసులు కారని మాకు నిజమైన రాజకీయ వారసుడు చంద్రరావు అని వేలాదిమంది హర్షధనాల మధ్య ప్రకటించిన విషయాన్ని మరిచిపోయారా ఇప్పటికైనా మాపై వ్యక్తిగత కక్షలు మానుకొని ఓంకార్ ఆశయ సాధన కోసం పని చేయాలని ఆయన సూచించారు. చరిత్ర మర్చిపోయి మాట్లాడడం సిగ్గుచేటు అని మండిపడ్డారు ఓంకార్ పేరును బతుకుతెరువు కోసం మాత్రమే వాడుకొని వారి చరిత్రను కనుమరుగు చేస్తున్నారనీ మండిపడ్డారు ఓంకార్ యొక్క త్యాగాలను వారి యొక్క ఆశయాలను నిలబెట్టడం కోసం ముందుకెళ్లడంలో ఓంకారి తో పనిచేసిన సహచర నాయకులు అందరిని ఐక్యం చేసి ఎంసిపిఐ గా ముందుకు తీసుకెళుతున్నామని దీన్ని ఓర్వలేకనే ఎంసిపిఐ యు నాయకులు బుదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఎంసి పిఐయు నాయకులు మా మీద ఆరోపణలు చేయడం కాకుండా ప్రజల్లో ఉండి ఓంకార్ యొక్క ఆశయాన్ని ముందుకు తీసుకుపోయే పనిలో ఉండాలని హితావు పలికారు పసలేని ఆరోపణలు ఆధారాలు లేని ఆరోపణలు మానుకోవడం మంచిదని స్థాయికి తగ్గట్టుగా ఆ నాయకులు అలవర్చుకోవాలని చెప్పారు భవిష్యత్తులో ఓంకార్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎవరెన్ని ఆరోపణలు చేసినా ఎత్తిన జెండాను దించేది లేదని తెలిపారు.ఈ పత్రిక విలేకరుల సమావేశంలో ఎం సిపిఐ పార్టీ నాయకులు సంగతి సాంబయ్య పానుగంటి నరసయ్య బిట్ల సమ్మయ్య బాసిపాక రమేష్ బలుసునూరి నరసయ్య మాదం తిరుపతి మాలోత్ రాజేష్ నాయక్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి సహిత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న రేవూరి



గీసుకొండ, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): గీసుగొండ మండలం ఎలుకుర్తి హవేలీ గ్రామంలో గల వేణుగోపాల స్వామి సహిత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి సహకరిస్తానని, పరకాల నియోజకవర్గం ప్రజల పైన లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో పరకాల కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడ కొమరారెడ్డి గీసుగొండ మండల మాజీ ఎంపీపీ భీమ గాని సౌజన్య గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి




గీసుకొండ, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): గంగదేవిపల్లి గ్రామంలోని చెంచు రాజు రమ కనిష్ట పుత్రిక సారీ ఫంక్షన్ కి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి వచ్చి ఆశీర్వదించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి పరకాల అధికార ప్రతినిధి చాడ కొమ్మారెడ్డి మాజీ ఎంపీపీ బీమాగాని సౌజన్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి కూసం రమేష్ గ్రామంలోని నాయకులు యారా రాజిరెడ్డి, లింగంపల్లి మల్లేష్, చెంచు రాజయ్య, న్యాల రాజు, గాడిదల రాజు, బైకని గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# రౌతు మనోహర్ ఆశయు సాధన కోసం ఉద్యమించాలి




పరకాల, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన రైతు మనోహర్ జీవితం నేటికీ ఆదర్శం అని, ఆయన ఆశయ స్ఫూర్తి కోసం ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.పరకాలలోని సిపిఎం నేత రౌతు మనోహర్ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం, స్థూపానికి ఆయన సతీమణి, కుమారులు, రౌతు శ్రీరామ్, రమేష్, అజయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి జీ. ప్రభాకర్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు పరకాల ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించి కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పాటుపడడంలో మనోహర్ కృషి ఎనలేనిదని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడ స్పందించే గుణం అయనదని, పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మనోహర్ ఆశయ స్ఫూర్తితో నేటి యువత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జీవనంలో ఆదర్శం మరణంలో ఆదర్శంగా నిలిచిన మనోహర్ లాంటి గొప్ప వ్యక్తి మన మధ్యలో లేకున్నా ఆయన కోరుకున్న నవ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాజకీయాలు వ్యాపారమైన నేటి రోజుల్లో నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం ఎర్రజెండా కోసం పాటుపడిన రౌతు మనోహర్ జీవితం నేటి యువతకు ఆదర్శం అని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడమే మనోహర్ కు నిజమైన నివాళి అని ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రైతు మనోహర్ వర్ధంతి సందర్భంగా పరకాల ప్రభుత్వ పాఠశాలలో క్రీడోత్సవాలు నిర్వహించి వారికి బహుమతులు అందజేయడంతో పాటు విద్యార్థులకు, పరీక్ష ప్యాడ్లు, కంపాక్స్ లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి, డి తిరుపతి, సీనియర్ జర్నలిస్ట్ లు దామెర రాజేందర్, కోగిల చంద్రమౌళి, మాజీ మార్కెట్ డైరెక్టర్ నక్క చిరంజీవి, హనుమకొండ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కొంగర జగన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్, పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ పట్టణ కార్యదర్శి సాయి తేజ ప్రజా సంఘాల నాయకులు బి,సంపత్, ఆదం, కృష్ణంరాజు, సర్వేశం పాల్గొన్నారు.

## అల్లం బాలకిషోర్ రెడ్డి పంపిన కానుకను అందజేసిన కాంగ్రెస్ నాయకులు



గీసుకొండ, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): గీసుకొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన గుల్లపెల్లి రాజ కోమల – రమేష్ దంపతుల ప్రథమ పుత్రిక వివాహ మహోత్సవానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించి అల్లం బాలకిషోర్ రెడ్డి పంపిన కానుకను అందజేసిన మనుగొండ కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో బత్తిని సాంబయ్య, గాడుదుల బొంద్యాలు, కందికొండ రాజ్ కుమార్, ఏంబాడీ పరమేష్, కొల్లూరి రాజమౌళి, మర్రి చిన్న ఎల్లయ్య, జక్కు ప్రవీణ్ రాజ్, చాపర్తి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్



పర్వతగిరి, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన అనపర్తి ఏకాంతం పర్వతగిరి టౌన్ బూత్ కన్వీనర్ పోకల శంకర్ మేనల్లుడు వివాహానికి గీసుకొండ ఓంకార్ గార్డెన్లో హాజరై,మండల కేంద్రం చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనగాం వెంకటేశ్వర్లు కుమారుడి వివాహానికి దుగ్గొండి మండలం చాపల బండ గ్రామానికి వెళ్లి నూతన వధూవరులను జాటోత్ శ్రీనివాస్ నాయక్ ఆశీర్వంచినారు.ఈ కార్యక్రమంలో మా మాజీ కోఆప్షన్ నెంబర్ ఎండి సర్వర్, సీనియర్ నాయకులు మహమ్మద్ అలీ,మాజీ ఎంపిటిసి సరోజన లచ్చు నాయక్, పర్వతగిరి టౌన్ అధ్యక్షులు కు సం రామచందర్, బోట్ల వెంకటేశ్వర్లు, కిషన్ నాయక్,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు వివాహ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వేణుగోపాల స్వామి సహిత లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న వరంగల్ కుడా చైర్మన్



గీసుకొండ, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): గీసుగొండ మండలం ఎల్కుర్తి (హవేళి) గ్రామంలో వేణుగోపాల స్వామి సహిత లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా వైభవంగా జరుగుతున్న సందర్భంగా వరంగల్ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి భీమ గాని సౌజన్య, మండల అధ్యక్షులు, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం



చిన్నశంకరంపేట, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): దుర్గామాత 11వ వార్షికోత్సవ సందర్భంగా చివరి రోజు గురువారం ముగింపు రోజున మక్కా రాజుపేట వడ్ల కాళిదాసు అఖిల జంగారాయి గ్రామంలో దుర్గామాత 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వడ్ల శ్రీశైలం అల్లుడు మకరాజ్ పేటకు చెందిన కాళిదాస్– అఖిల కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నశంకరంపేట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, జీవన్, మహేష్, పడాల శ్రీనివాస్, బందెల ప్రభాకర్, వడ్ల శ్రీనివాస్, సిద్దిరెడ్డి, సాగర్ రెడ్డి, వేణు, గణేష్, సూరి, రాము, గ్రామ ప్రజలు. పెద్దలు దుర్గామాత భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అన్నప్రసాద కార్యక్రమానికి ముందుకు వచ్చిన మక్కా రాజుపేట వడ్ల కాళిదాస్ అఖిల కుటుంబ సభ్యులకు దుర్గామాత ఆశీస్సులు ఉండాలని వారికి గ్రామ ప్రజల తరపున ఆలయ కమిటీ సభ్యులు కోరారు

## గుడి నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్



దామెర, 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): కోగిల్వాయి గ్రామంలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి గుడి నిర్మాణ కోసం ముదిరాజ్ సొసైటీ చైర్మన్ జంగిలి వెంకటేష్ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ కాళీ ప్రసాద్ రావు హనుమకొండ జిల్లా ముదిరాజ్ సొసైటీ చైర్మన్ బండి సారంగపాణి, మాజీ జిల్లా సొసైటీ చైర్మన్ బుస మల్లేశం, భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నటువంటి పెద్ద మనుషులు సొసైటీ కమిటీ సభ్యులు ప్రముఖులు జంగిలి నాగరాజు గోల్కొండ రవి, సంగన బోయిన కిరణ్, జంగిలి బాబు సంగనబోయిన వేణు, గోల్కొండ సాంబయ్య, జంగిలి మల్లేష్,, జంగిలి సారంగపాణి, మౌటం సమ్మయ్య, గోనెల నరసయ్య, గోనెల సమ్మయ్య,జంగిలి ప్రభాకరు ముదిరాజ్ సభ్యులందరూ పాల్గొని ఈ యొక్క భూమి పూజ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది.

# బాదం, జీడిపప్పు కన్నా ఎంతో శక్తిని ఇచ్చే నట్స్

హెల్త్ న్యూస్ , 13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):నట్స్ అంటే మనకు ముందుగా జీడిపప్పు, బాదంపప్పు గుర్తుకు వస్తాయి. చాలా మంది వీటిని తినేందుకు ఎంతో ఆసక్తిని చూపిస్తుంటారు. పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం రోజూ నట్స్‌ను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. బాదంపప్పు, జీడిపప్పు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కనుక వీటిని రోజూ నానబెట్టి తినాలని చెబుతుంటారు. రోజూ వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ చేసే వారు కచ్చితంగా బాదం పప్పును తింటుంటారు. అలాగే జీడిపప్పు కూడా ఎంతో మేలు చేస్తుంది. అయితే మీకు తెలుసా..? తక్షణ శక్తి కావాలంటే ఈ రెండు పప్పుల కన్నా ఇంకో రకమైన పప్పును తినాలి. అవే పైన్ నట్స్. ఈ పేరును మీరు ఎప్పుడూ విని ఉండరు. కానీ ఈ నట్స్ కూడా మనకు అందుబాటులో ఉన్నాయి.



మెటబాలిజం మెరుగు పడుతుంది..

పైన్ నట్స్ మనకు సూపర్ మార్కెట్లలో ఎక్కువగా లభిస్తాయి. ఈ నట్స్ వాస్తవానికి జీడిపప్పు, బాదంపప్పు కన్నా తక్షణ శక్తిని ఎక్కువగా అందిస్తాయి. కనుక వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు బాగా అలసిపోతుంటే ఈ నట్స్‌ను తింటే వెంటనే రిలీఫ్ లభిస్తుంది. ఈ నట్స్‌ను ఉదయం బ్రేక్‌ఫాస్ట్ సమయంలో తినాలి. దీంతో రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. ఉత్సాహంగా అనిపిస్తుంది. ఎంత పనిచేసినా అలసట అనేది ఉండదు. ఇక పైన్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ నట్స్‌ను తింటే అనేక పోషకాలు లభిస్తాయి. ముఖ్యంగా ఐరన్, మెగ్నిషియం, ప్రోటీన్లు అధికంగా లభిస్తాయి. ఇవి మన శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతాయి. కండరాలను బలంగా మార్చుతాయి. శరీర మెటబాలిజంను పెంచుతాయి. రోగ నిరోధక వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలో జీవక్రియలు అన్నీ సక్రమంగా నిర్వహించబడతాయి.

టైప్ 2 దయాబెటిస్‌కి..

పైన్ నట్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ నట్స్‌ను రోజూ తింటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఇవి దయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నట్స్‌ను రోజూ తింటుంటే టైప్ 2 దయాబెటిస్‌ను అదుపు చేయవచ్చు. పైన్ నట్స్‌లో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి దోహదపడుతుంది. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది. శరీరం ఆక్సిజన్‌ను మరింత సమర్థవంతంగా వినియోగించుకుంటుంది. దీంతో శక్తి స్థాయిలు పెరుగుతాయి. అలసట రాదు. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు.

గుండె ఆరోగ్యానికి..

పైన్ నట్స్ లో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ముఖ్యంగా ఈ నట్స్ లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతుంది. దీంతో శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల హైబీపీ తగ్గడమే కాకుండా గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పైన్ నట్స్‌లో మెగ్నిషియం, ఫాస్ఫరస్, విటమిన్ కె, క్యాల్షియం అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెంచి ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియోపోరోసిస్ రాకుండా నివారించవచ్చు. ఇలా పైన్ నట్స్‌ను రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# అసిడిటీతో అల్లాడిపోతున్నారా.. ఈ హోం రెమెడీస్ తో తగ్గించుకోండి

హెల్త్ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):అసిడిటీ అనేది చాలా మందికి సాధారణ సమస్యగా మారిపోయింది. గ్యాస్ట్రిక్ గ్రంథులు ఎక్కువ మోతాదులో ఆమ్లాన్ని ఉత్పత్తి చేయడం వల్ల ఏర్పడుతుంది. సాధారణంగా, ఆమ్లం జీర్ణక్రియకు అవసరమయ్యే సహజ రసాయనం అయినప్పటికీ, ఇది అధిక మోతాదులో ఉత్పత్తి అయితే పేగు గోడలపై ప్రభావం చూపించి అసౌకర్యాన్ని కలిగిస్తుంది. దీనివల్ల కడుపులో మంట, నొప్పి, పుల్లటి తేన్పులు, ఛాతీలో మంట వంటి సమస్యలు వస్తాయి. అధికమైన అసిడిటీ ఉంటే తలనొప్పి, వాంతులు కూడా రావచ్చు. అయితే, కొన్ని సహజ సిద్ధమైన ఇంటి చిట్కాలతో అసిడిటీని తగ్గించుకోవచ్చు.

అసిడిటీని కలిగించే ప్రధాన కారణాలు:

వేళకు ఆహారం తీసుకోకపోవడం, ఎక్కువగా కారం, మసాలాలు, నూనెతో చేసిన ఆహారాన్ని తీసుకోవడం. కార్బొనేటెడ్ డ్రింక్స్ (సోడాలు, కోక్) ఎక్కువగా తాగడం. ఆల్కహాల్, ధూమపానం అలవాటు అసిడిటీని కలిగిస్తాయి. రోజువారి జీవనశైలిలో మార్పులు రావడం కూడా కడుపులో మంట, అసిటిడీ సమస్యలకు కారణమవుతుంది. ఒత్తిడి, టెన్షన్ ఎక్కువగా ఉండటం, తగినంతగా నీరు తాగకపోవడం,

నిద్రలేమి, సరిగ్గా నడక, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాలు సమస్యలను పెంచుతాయి. ఎక్కువగా కాఫీ, టీ తీసుకోవడం, ఎక్కువ సమయం ఖాళీ కడుపుతో ఉండడం, కొంతమందికి గ్యాస్ట్రిక్ సమస్యలకు జన్యుపరమైన కారణాలు కూడా ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

వేళకు ఆహారం తీసుకోవాలి. ఎక్కువగా కారం, మసాలాలు, నూనెతో చేసిన ఆహారానికి దూరంగా ఉండాలి. రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగాలి. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. అధిక బరువు కూడా అసిడిటీకి కారణం కావచ్చు. కాబట్టి బరువును అదుపులో ఉంచుకోవడం ముఖ్యం. ధూమపానం , మద్యపానం అసిడిటీని పెంచుతాయి. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి.

ఇంటి చిట్కాలు:

సోంపు గింజలను నమలడం వల్ల అసిడిటీ తగ్గుతుంది. పుదీనా ఆకులు జీర్ణక్రియకు సహాయపడతాయి. అసిడిటీని తగ్గిస్తాయి. పుదీనా ఆకులను నీటిలో మరిగించి ఆ నీటిని తాగవచ్చు. అల్లం జీర్ణక్రియకు చాలా మంచిది. ఇది అసిడిటీని కూడా తగ్గిస్తుంది. అల్లం ముక్కను నమలవచ్చు లేదా అల్లం టీ తాగవచ్చు. తులసి ఆకులు అసిడిటీని తగ్గించడంలో సహాయపడతాయి. తులసి ఆకులను నమలవచ్చు లేదా తులసి టీ తాగవచ్చు. పెరుగులో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది అసిడిటీని తగ్గిస్తుంది. భోజనం తర్వాత పెరుగు తినడం మంచిది. చల్లటి పాలు తాగడం వల్ల అసిడిటీ తగ్గుతుంది.



నిమ్మరసం-తేనె:

నిమ్మరసం అసిడిటీని పెంచుతుందని చాలామంది అనుకుంటారు, కానీ ఇది నిజం కాదు. నిమ్మరసం జీర్ణక్రియకు సహాయపడుతుంది మరియు అసిడిటీని తగ్గిస్తుంది. ఒక గ్లాసు నీటిలో నిమ్మరసం పిండి వేసుకుని తాగవచ్చు. కొబ్బరి నీరు అసిడిటీని తగ్గించడంలో సహాయపడుతుంది. అరటిపండులో పొటాషియం ఉంటుంది, ఇది అసిడిటీని తగ్గిస్తుంది. ఓట్స్ లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది మరియు అసిడిటీని తగ్గిస్తుంది. తేనె అసిడిటీని తగ్గించడంలో సహాయపడుతుంది. ఒక చెంచా తేనెను గోరువెచ్చని నీటిలో కలిపి తాగవచ్చు. ఆపిల్ సైడర్ వెనిగర్ కూడా అసిడిటీని తగ్గించడంలో సహాయపడుతుంది. ఒక చెంచా ఆపిల్ సైడర్ వెనిగర్‌ను ఒక గ్లాసు నీటిలో కలిపి తాగవచ్చు.

ఈ వంటింటి చిట్కాలు సాధారణంగా అసిడిటీని తగ్గించడానికి సహాయపడతాయి. మీకు తరచుగా అసిడిటీ వస్తుంటే, వైద్యుడిని సంప్రదించడం మంచిది. కొన్ని సందర్భాలలో, అసిడిటీకి కారణం ఇతర ఆరోగ్య సమస్యలు కావచ్చు. కాబట్టి వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం.

# కలబంద గుజ్జుతో చెమట పొక్కులకు చెక్

హెల్త్ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):వేసవికాలం వచ్చిందంటే చాలు చాలామంది చెమట పొక్కులతో సతమతమవుతుంటారు. సాధారణంగా వేసవికాలంలో శరీరానికి చెమటపడుతుంది. ఆ క్రమంలో కొన్నిసార్లు చెమట గ్రంథులు మూసుకుపోతాయి. అప్పుడే చెమటకాయలు వస్తాయి. చర్మం ఎర్రగా కందిపోయి, చిన్నచిన్న నీటిపొక్కుల్లా మొదలవుతాయి. దాంతో విపరీతమైన మంటా, దురద మొదలవుతుంది. ఇవి శరీరంలో ఏ భాగంలోనైనా రావొచ్చు.




అయితే వీటిబారి నుంచి తప్పించుకోడానికి కొన్నిచిట్కాలు పాటిస్తే సరి...ఎండాకాలంలో ప్రతి రోజూ రెండుమూడు సార్లు చల్లని నీటితో స్నానం చేయడం మంచిది. ఆహారంలో తరచు మంచినీళ్లు, మజ్జిగ తీసుకుంటూ ఉండాలి. కొబ్బరినీళ్లు, అనాస రసం, చెరకు రసం ఈ వేసవి కాలంలో తీసుకుంటే చలువ చేస్తుంది, వేడిని తగ్గిస్తుంది.చెమట పొక్కులు వచ్చిన ప్రాంతంలో కలబంద గుజ్జును రాయాలి. ఇందులో యాస్ట్రింజెంట్ గుణాలు అధికంగా ఉంటాయి. చెమట పొక్కుల్నిమాత్రమే కాకుండా కొన్నిరకాల ఇన్‌ఫెక్షన్లను దూరం చేస్తాయి.ఐసుముక్కల్ని మెత్తని వస్త్రంలోకి తీసుకుని చెమట పొక్కుల మీద నెమ్మదిగా వత్తాలి. తరచూ ఇలా చేయడం వల్ల పొక్కులు త్వరగా తగ్గిపోతాయి. వాటివల్ల వచ్చే మంట కూడా అదుపులో ఉంటాయి.

# పగటి నిద్రతో బీపీకి చెక్ చెప్పొచ్చా



హెల్త్ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):పగలు పడుకోవడం మంచిది కాదని చాలా మంది చెబుతుంటారు కానీ అందులో నిజం లేదని తేలిపోయింది. అధిక రక్తపోటుతో బాధపడేవారు పగటి పూట 45 నిమిషాలు నిద్రపోతే రక్తపోటు వెంటనే నియంత్రణలోకి వస్తుందని తాజా పరిశోధనలో వెల్లడయింది. ముఖ్యంగా ఒత్తిడికి గురయినపుడు ఈ పద్ధతి బాగా ఉపకరిస్తుందని ఇందులో నిరూపణ అయ్యింది. పెన్సిల్వేనియాలోని అల్లెగెనీ కాలేజ్‌కు చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలో భాగంగా 85 మంది ఆరోగ్యవంతులైన విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించి అధ్యయనం చేశారు.ఒక గ్రూపు వారికి ప్రతి రోజు గంట పాటు మధ్యాహ్నం నిద్రపోయే వెసులుబాటు కల్పించారు. మరొక గ్రూపుకు నిద్రపోయే అవకాశం ఇవ్వకుండా ఏదో ఒక పని చెబుతూ వచ్చారు. తరువాత వారిని రక్తపోటు పరిశీలిస్తే 45 నుంచి 60 నిమిషాల పాటు నిద్రపోయిన వారి రక్తపోటు చాలా తక్కువగా ఉంది. తమ పరిశోధనల్లో వెల్లడయిందేమిటంటే మధ్యాహ్నం నిద్ర వల్ల కార్డియో వాస్క్యులర్ సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. మెంటల్ స్ట్రెస్ తగ్గిపోతుందని పరిశోధనలో పాలుపంచుకున్న ర్యాన్ బ్రిండిల్ తెలిపారు.



KR TV క్రాంతి
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025

# క్రీడలు

epaper.krtvnews.com



# ఆర్సీబీ కొత్త సారథిగా రజత్ పటీదార్



స్పోర్ట్స్ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు కొత్త సారథి వచ్చాడు. యువ బ్యాటర్ రజత్ పటీదార్ కు బాధ్యతలు అప్పగిస్తూ మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టింది. గత సీజన్‌లో ఆర్సీబీని నడిపించిన ఫాఫ్ డుప్లెసిస్‌ను ఈసారి రిటైన్ చేసుకోలేదు. అలాగే మెగా వేలంలో దక్కించుకోలేదు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ జట్టులో ఉన్నప్పటికీ.. కెప్టెన్సీ వైపు మొగ్గు చూపలేదు. మరో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌తోపాటు కృనాల్ పాండ్య కూడా ఈ రేసులో నిలిచారు. అయితే, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రజత్‌కే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది.

**ఇదీ నేపథ్యం :** 31 ఏళ్ల రజత్ పటీదార్ భారత్ తరఫున గతేడాదే టెస్టుల్లోకి అరంగేట్రం చేయగా.. 2023లో వన్డేల్లోకి వచ్చాడు. టీమ్‌ఇండియాకు కేవలం మూడు టెస్టులు, ఒకే ఒక్క వన్డే మాత్రమే ఆడాడు. ఇప్పటి వరకు అంతర్జాతీయ టీ20లు ఆడిన అనుభవం అతడికి లేకపోవడం గమనార్హం. ఐపీఎల్‌లో 2021లోకి అడుగుపెట్టిన రజత్ ఇప్పటి వరకు 27 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 34.74 సగటుతో 799 పరుగులు చేశాడు. గత ఐపీఎల్ మెగా వేలానికి ముందు ఆర్సీబీ రిటైన్ చేసుకున్న జాబితాలో ఉన్నాడు. అతడిని రూ. 11 కోట్లకు ఆర్సీబీ అట్టిపెట్టుకుంది.

'ఆర్సీబీకి చాలా మంది సారథ్యం వహించారు. ఆ జాబితాలోకి రజత్ పటీదార్ చేరాడు. తప్పకుండా గత సారథుల మాదిరిగానే జట్టును ముందుకు నడిపిస్తాడని ప్రతి ఒక్కరికీ చెప్పగలను. జట్టులో అతడు ఎదిగిన తీరు అద్భుతం. టీమ్‌లోని ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలుస్తారు. కెప్టెన్సీ అనేది పెద్ద బాధ్యతే. సారథిగా నేనూ చాలా ఏళ్లుగా ఉన్నా. ఫాఫ్ డుప్లెసిస్ గత రెండేళ్లు జట్టును నడిపించాడు. ఇక నుంచి రజత్ ఆ బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. జట్టును మెరుగ్గా నడిపిస్తాడని ఆశిస్తున్నా. ఇది అతడికి దక్కిన గొప్ప గౌరవం. దేశవాళీలో జట్టును నడిపించిన అనుభవం అతడికి ఉంది. ఇప్పుడు ఐపీఎల్‌లో అద్భుతమైన ఫ్రాంచైజీల్లో ఒకటైన ఆర్సీబీకి సారథిగా వచ్చాడు. సహచర క్రికెటర్లుగా మేమంతా అతడి వెనుకుంటాం. అభిమానుల మద్దతూ ఉంటుంది. ఫ్రాంచైజీకి ప్రయోజనం ఉండేలా నిర్ణయం వచ్చింది.



జట్టుకు ఏది మంచిది? ఫ్రాంచైజీని ఇంకా ముందుకు ఎలా తీసుకెళ్లాలనేది రజత్ త్వరగానే అలవాటు చేసుకుంటాడు. వచ్చే సీజన్‌ను రజత్ సారథ్యంలో గొప్పగా ప్రారంభిస్తామని బలంగా విశ్వసిస్తున్నా" అని కోహ్లీ వెల్లడించాడు.

**అందుకే అతడి వైపు: ఆర్సీబీ డైరక్టర్**

"ఆర్సీబీ సారథిగా మేం ఎవరైతే బాగుంటుందని పెద్ద ఎత్తున చర్చించాం. భారత క్రికెటర్ లేదా ఓవర్సీస్ ఆటగాడినా అనేది ప్రధాన అంశం. అయితే, టీమ్‌ఇండియా ప్లేయర్ అయితేనే బాగుంటుందనే ఉద్దేశంతో రజత్ వైపు మొగ్గు చూపాం. అంతేకానీ, విదేశీ క్రికెటర్లపై ఎలాంటి వ్యతిరేకత లేదు. భారత పిచ్‌లపై పూర్తి అవగాహన ఉంటే మంచిదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. అందులో విరాట్ కోహ్లీ కూడా ఓ ఆప్షన్‌గా ఉన్నాడు. లేకపోతే అభిమానుల నుంచి తీవ్రస్థాయిలో కామెంట్లు వస్తాయని మాకు తెలుసు. నా ఉద్దేశంలో కోహ్లీకి కెప్టెన్సీ అనేది ప్రత్యేకంగా అవసరంలేదు. జట్టుకు నడిపించడం సీనియర్‌గా ఎప్పుడూ బాధ్యత తీసుకుంటాడు. గతేడాది ఫాఫ్ డుప్లెసిస్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ.. జట్టుకు అవసరమైనప్పుడు కోహ్లీనే ముందుకొచ్చాడు. మైదానంలో జట్టును నడిపించాడు" అని ఆర్సీబీ డైరక్టర్ బోబట్ వెల్లడించారు.

# ఏ జట్టునైనా ఓడిస్తాం..

## చాంపియన్స్ ట్రోఫీ మాదే: బంగ్లాదేశ్ కెప్టెన్



స్పోర్ట్స్ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): చాంపియన్స్ ట్రోఫీ-2025 నేపథ్యంలో బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హుసేన్ షాంటో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమదైన రోజున ఎంతటి పటిష్ట జట్టునైనా ఓడించగల సత్తా తమ జట్టుకు ఉందని పేర్కొన్నాడు. తమకు గతంలో నాణ్యమైన పేసర్లు, మణికట్టు స్పిన్నర్లు లేరని.. అయితే, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నాడు.

**తొలుత టీమిండియాతో**

ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపు తిప్పగల బౌలర్లు, బ్యాటర్లు జట్టులో పుష్కలంగా ఉన్నారని షాంటో సహచర ఆటగాళ్లను కొనియాడాడు. కాగా ఫిబ్రవరి 19 నుంచి పాకిస్తాన్ -దుబాయ్ వేదికగా చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ మొదలుకానున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బంగ్లాదేశ్ ఫిబ్రవరి 20న దుబాయ్‌లో టీమిండియాతో మ్యాచ్‌లో రంగంలోకి దిగనుంది.

అనంతరం ఫిబ్రవరి 24న రావల్పిండిలో న్యూజిలాండ్‌తో, ఫిబ్రవరి 27న అదే వేదికపై పాకిస్తాన్ జట్టుతో తలపడనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే బంగ్లాదేశ్ తమ జట్టును ప్రకటించింది. ఈ క్రమంలో ఐసీసీతో మాట్లాడిన కెప్టెన్ నజ్ముల్ షాంటో తమ జట్టు ఈ టోర్నీలో విజేతగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశాడు.

**ఏ జట్టునైనా ఓడిస్తాం.. చాంపియన్స్ ట్రోఫీ మాదే**

"చాంపియన్స్‌గా నిలిచేందుకే మేము టోర్నీ ఆడేందుకు వెళ్తున్నాం. ఇందులో పాల్గొంటున్న ఎనిమిది జట్లు కూడ ఇందుకు అర్హత కలిగినవే. ప్రతి జట్టులోనూ నాణ్యమైన ఆటగాళ్లు ఉన్నారు. ఇక మా జట్టు సామర్థ్యాల పట్ల నాకు నమ్మకం ఉంది.

ఎవరూ ఒత్తిడిగా ఫీలవ్వడం లేదు. ముందుగా చెప్పినట్లు ఈ ఈవెంట్లో ఆడే ప్రతి జట్టు విజేతగా నిలవాలని భావించడం సహజం. అయితే, మా తలరాతలో ఏముందో తెలియదు. మా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు కఠినంగా శ్రమిస్తున్నాం.

లక్ష్యాన్ని చేరుకుంటామనే నమ్మకం ఉంది. జట్టులోని పదిహేను మంది సభ్యుల పట్ల నాకు విశ్వాసం ఉంది. మ్యాచ్‌ను ఒంటి చేత్తో మలుపు తిప్పగల సత్తా వారిలో ఉంది. గత కొంతకాలంగా మా జట్టులో నాణ్యమైన పేస్ బౌలర్లు, మణికట్టు స్పిన్నర్లు లేరనే లోటు ఉండేది.అయితే, ఇప్పుడు మా పేస్ దళం పటిష్టంగా ఉంది. మంచి స్పిన్నర్లు కూడా ఉన్నారు. మాదొక సమతూకమైన జట్టు. జట్టులోని ప్రతి సభ్యుడు తమ బాధ్యతలను చక్కగా నెరవేరుస్తారనే నమ్మకం ఉంది. మాదైన రోజున ఎంతటి పటిష్ట జట్టునైనా మేము ఓడించగలం" అని నజ్ముల్ షాంటో విశ్వాసం వ్యక్తం చేశాడు.

# ఇద్దరు వికెట్ కీపర్లతో ఆడలేం

స్పోర్ట్స్ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌ను 4-1తో, వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసి టీమ్‌ఇండియా జోష్ మీదుంది. ఇదే ఊపును ఛాంపియన్స్ లోనూ ప్రదర్శించాలనుకుంటోంది. ఈ మెగా టోర్నీ కోసం మరో రెండు రోజుల్లో భారత జట్టు దుబాయ్‌కి వెళ్లనుంది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్‌ఇండియా తుది జట్టు ఎలా ఉండనుంది? ఎవరికి ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కుతుంది? ఎవరు బెంచ్‌కు పరిమితమవుతారనే దానిపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వికెట్‌కీపర్‌గా యువ ఆటగాడు రిషభ్ పంత్‌ను తీసుకుంటారా? లేదా ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో రాణించిన కేఎల్ రాహుల్ నే కొనసాగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ క్లారిటీ ఇచ్చాడు. ఈ మెగా టోర్నీలో కేఎల్ రాహులే తమ ఫస్ట్ ఛాయిస్ వికెట్‌కీపర్ అని గంభీర్ తెలిపాడు. 'కేఎల్ రాహుల్ ఇప్పుడు మా నంబర్ వన్ వికెట్ కీపర్. ఇప్పటికైతే ఇదే చెప్పగలను. రిషభ్ పంత్ కు ఏ క్షణంలోనైనా అవకాశం రావచ్చు. కేఎల్ రాహుల్ రాణిస్తున్నాడు. అయితే, జట్టులో ఇద్దరు నాణ్యమైన వికెట్‌కీపర్‌లు ఉంటే ఒకే మ్యాచ్‌లో ఇద్దరిని ఆడించలేం. ఇక రాహుల్‌ని ఐదో స్థానంలోనే ఆడిస్తారా? అంటే అది కూడా స్పష్టంగా చెప్పలేం. ఏ ప్లేయర్ అయినా ఐదో స్థానంలో ఆడొచ్చు. ఆటగాడి కన్నా జట్టు ప్రయోజనాలే ముఖ్యం. ఆ సమయంలో సగటు, రికార్డులు చూడం. ఏ ఆటగాడు బాగా రాణించగలడో మాత్రమే చూస్తాం' అని గంభీర్ పేర్కొన్నాడు.



ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో రిషభ్ పంత్‌కు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే ఛాన్స్ రాలేదు. కేఎల్ రాహుల్‌ను వికెట్‌కీపర్‌గా తీసుకున్నారు. రాహుల్ మొదటి రెండు వన్డేల్లో ఆరో స్థానంలో వచ్చి వరుసగా 2, 10 స్కోర్లు చేశాడు. మూడో వన్డేలో ఐదో స్థానంలో వచ్చి 29 బంతులలో 40 పరుగులు చేశాడు. ఇక, ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభంకానుంది. టీమ్‌ఇండియా ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్, 23న పాకిస్థాన్, మార్చి 2న న్యూజిలాండ్‌తో తలపడనుంది.

# ఆ కల ఇంకా నెరవేరలేదు కానీ

మూవీ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మలయాళ సినిమాలో నటించాలన్న తన కల ఇంకా నెరవేరలేదని మీనాక్షీ చౌదరి అన్నారు. కానీ, మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ సరసన నటించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తన కొత్త సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' మంచి విజయం అందుకున్న సందర్భంగా ఓ మీడియా సంస్థతో జరిగిన చిట్‌చాట్‌లో ఆమె పలు విశేషాలు పంచుకున్నారు. తాను కలిసి నటించిన హీరోల గురించి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ సంగతులు ఆమె మాటల్లోనే..



వారి వర్కింగ్ స్టైల్ వేరు

"మలయాళ ఇండస్ట్రీ వాళ్ల పని విధానం పూర్తి భిన్నంగా ఉంటుంది. ఆ వర్కింగ్ స్టైల్ నన్ను ఆకర్షిస్తుంటుంది. నేను ఇంకా అక్కడ సినిమాలు చేయకపోయినా దుల్కర్‌తో కలిసి 'లక్కీ భాస్కర్' లో నటించడం ఆనందంగా ఉంది. ఎప్పుడూ ప్రతి సన్నివేశాన్ని ఇంకాస్త బెటర్‌గా చేయాలనుకుంటుంటాడు దుల్కర్. ఆయన్నుంచి నేను నేర్చుకున్నది అదే. తెలుగులో తన సినిమాలకు తనే డబ్బింగ్ చెప్పడం విశేషం. అదే స్ఫూర్తితో 'సంక్రాంతికి వస్తున్నాం'లోని నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పా. 'లక్కీ భాస్కర్'లో తల్లి పాత్ర కావడంతో ప్రేక్షకులు నన్ను అంగీకరిస్తారో లేదోనని కాస్త టెన్షన్ పడేదాన్ని. కానీ సుమతి రోల్‌ను ఆడియన్స్ బాగా ఆదరించారు".

# రాజకీయాల్లో రీ ఎంట్రీ పై.. చిరు సెన్సేషనల్ కామెంట్స్




మూవీ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇదే సందర్భంగా తన పొలిటికల్ రీ ఎంట్రీపై వస్తోన్న ఊహాగానాలపై క్లారిటీ ఇచ్చారు. తాను రాజకీయాల వైపు మళ్లీ వెళ్తానేమోనని పలువురు అనుకుంటున్నారు. పెద్ద పెద్ద వారిని కలుస్తున్నాడు. ఏంటీ? అటువైపు ఏమైనా వెళ్తాడా?' అని కొందరు సందేహపడుతున్నారు. అలాంటి డౌట్స్ పెట్టుకోవద్దు. జీవితాంతం కళామతల్లి సేవలోనే ఉంటాను. అంటూ చెప్పారు చిరు. అంతేకాదు సినీరంగానికి సేవల కోసమే రాజకీయ పెద్దలను కలుస్తున్నానని.. అంతకుమించి ఏమీ లేదంటూ చెప్పారు చిరు. రాజకీయంగా తాను అనుకున్న లక్ష్యాలు, సేవలు నెరవేర్చేందుకు తన సోదరుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉన్నారని చెప్పారు. జీవితాంతం రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాలకు అతి దగ్గరగా ఉంటా అంటూ.. మరోసారి బలంగా కుండబద్దలు కొట్టి మరీ చెప్పారు.

# 'రానా నాయుడు 2' అప్‌డేట్ ఇచ్చిన రానా



మూవీ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): అగ్ర కథానాయకుడు వెంకటేశ్ , రానా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'రానా నాయుడు 2'. గతంలో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలై విజయం సాధించిన 'రానా నాయుడు'కు సీక్వెల్‌గా ఇది రానుంది. తాజాగా రానా నిర్మించిన 'ఇట్స్ కాంప్లికేటెడ్' సినిమా ఈవెంట్లో 'రానా నాయుడు 2' గురించి మాట్లాడారు. ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ సిద్ధమైందన్నారు. ట్రైలర్ విడుదల తేదీ కూడా ఖరారైనట్లు తెలిపారు. అతి త్వరలోనే ఈ సిరీస్ స్ట్రీమింగ్‌కు వస్తుందన్నారు. ఇక ఇదే ఈవెంట్లో వెంకటేశ్ హీరోగా నటించిన 'నువ్వు నాకు నచ్చావ్' రీ రిలీజ్ గురించి కూడా రానా మాట్లాడారు. ఆ మూవీ యూనిట్‌తో మాట్లాడి ఈ సినిమాను రీరిలీజ్ చేస్తామన్నారు.గతేడాది జులైలో 'రానా నాయుడు2' షూటింగ్ ప్రారంభమైంది. గతంలో సీజన్ 2 గురించి నెట్‌ఫ్లిక్స్ బృందం ఓ సందర్భంలో మాట్లాడుతూ.. మన దేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఈ సిరీస్‌కు విశేష ప్రేక్షకాదరణ లభించిందని దానిని దృష్టిలోపెట్టుకొనే సీజన్-2ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నామని తెలిపింది. మరెన్నో ట్విస్టులు, మరింత ఫ్యామిలీ డ్రామాతో 'రానా నాయుడు-2' త్వరలో విడుదల చేస్తామని ప్రకటించింది. దీనిపై పలువురు సినీప్రియులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల దీని టీజర్‌ను విడుదల చేయగా మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఈ సిరీస్‌లో నటనకు గాను రానా 'ఇండియన్ టెలీ అవార్డు 2024'లో ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్ విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ నెట్‌ఫ్లిక్స్‌లో చరిత్ర సృష్టించింది. గ్లోబల్ స్థాయిలో ఎక్కువ వ్యూస్‌ను సొంతం చేసుకున్న వాటిలో ఇది టాప్‌లో నిలిచింది.

# పవన్ కల్యాణ్ నుంచి ఆ లక్షణం నేర్చుకోవాలి



మూవీ న్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్'తో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనున్నారు నటి నిధి అగర్వాల్ . తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడారు. పవన్‌కల్యాణ్, ప్రభాస్‌లతో వర్క్ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

2022లో విరామం తీసుకోవడానికి కారణాన్ని నిధి వివరించారు. "నేను స్టార్ కిడ్‌ని కాదు. అలాగే నాకు సినిమా నేపథ్యం కూడా లేదు. నేను నటిగా మొదటిస్థానంలో ఉండడమే పెద్ద విషయం. సినిమాల్లో అవకాశాలు రావడమే నాకు విజయంతో సమానం. ఎక్కువ సినిమాలు చేయాలని అందరికీ ఉంటుంది. కానీ, నేను మాత్రం నమ్మకం ఉన్న కథలనే ఎంచుకుంటాను. అలాంటివాటిపై మాత్రమే దృష్టిపెడతాను. నేనేం హీరోను కాదు.. వరుసగా కమర్షియల్ సినిమాలు చేయడానికి. ఒకవేళ నేను వరుస సినిమాలు చేసినా నన్ను అలాంటి స్క్రిప్టులు ఎంచుకున్నందుకు విమర్శిస్తారు. అందుకే గొప్ప కథలను మాత్రమే ఎంచుకుంటున్నాను" అని చెప్పారు.

అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడిన నిధి.."హరిహర వీరమల్లు'లో నా పాత్ర ఇప్పటివరకు నేను చేసిన వాటిల్లో అత్యుత్తమమైనది. ఆ పాత్ర కోసం గుర్రపు స్వారీ, క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. కథక్ నేర్చుకున్నాను. నా కల నిజమైంది. అదృష్టవంతురాలిననిపించింది. అలాగే హారర్ సినిమాలంటే గతంలో భయం ఉండేది. అందుకే 'ది రాజా సాబ్' చేయాలనుకున్నాను. ఆ చిత్ర బృందమంతా ఫన్నీగా ఉంటుంది. సెట్‌లో స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు కూడా అందరం నవ్వుతూనే ఉన్నాం" అని అన్నారు.

పవన్ కల్యాణ్ , ప్రభాస్‌లు తనను ఎంతో ప్రోత్సహించారని నిధి తెలిపారు. "పవన్ సెట్స్‌లో ఉన్నప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉంటారు. యాక్షన్ చెప్పగానే పూర్తిగా లీనమవుతారు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోరు. తన సన్నివేశంపై మాత్రమే దృష్టిపెడతారు. ఈ లక్షణాన్ని నేను కూడా అలవాటు చేసుకోవాలి. ఇక ప్రభాస్ ఎప్పుడూ ఫన్నీగా ఉంటారు. ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని చెప్పారు.

# రిలేషన్‌షిప్‌లో వేధింపులు ఎదుర్కొన్నా

మూవీ న్యూస్,13 ఫిబ్రవరి(క్రాంతిన్యూస్ ):'సంక్రాంతికి వస్తున్నాం' తో ఈ ఏడాది తెలుగులో విజయాన్ని అందుకున్నారు నటి ఐశ్వర్యా రాజేశ్ . తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన సినీ కెరీర్, వ్యక్తిగత జీవితానికి గురించి ఎన్నో విషయాలు పంచుకున్నారు. తన తల్లి (నటి నాగమణి) నుంచే తాను ఎంతో స్ఫూర్తి పొందానని ఆమె చెప్పారు. స్వతహాగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. వచ్చిన అవకాశాల్లో నచ్చిన సినిమాలు చేసుకుంటూ ఈ స్థాయికి వచ్చినందుకు తాను ఎంతో గర్వంగా ఉన్నానని అన్నారు.

"మా అమ్మే నాకు స్ఫూర్తి. మా తల్లిదండ్రులకు మేము నలుగురు సంతానం. చిన్నతనంలోనే నా తండ్రి చనిపోయారు. అమ్మ ఒక్కరే ఎంతో కష్టపడి మమ్మల్ని పెంచింది. ఈ ప్రయాణంలో ఆమె మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. ఆమెకు అండగా నిలబడాలనే ఉద్దేశంతోనే చిన్న వయసులోనే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేశాను. సినిమాల్లోకి అడుగుపెట్టాను. నాకు నచ్చిన సినిమాలు ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నాను. అమ్మను చూసుకుంటున్నాను. అందుకు నేను ఎంతో గర్వంగా ఉన్నా" అని ఐశ్వర్య చెప్పారు.రిలేషన్‌షిప్ గురించి మాట్లాడుతూ.. "లవ్ కంటే కూడా అది బ్రేకప్ అయినప్పుడు వచ్చే బాధ అంటే నాకెంతో భయం. నేను చాలా ఎమోషనల్. ప్రేమించే సమయం కంటే అది మిగిల్చిన బాధ నుంచి బయటకు రావడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. గతంలో నేను రిలేషన్‌లో ఉన్నాను. సినిమాల్లోకి అడుగుపెట్టిన కొత్తలో ఒక వ్యక్తిని ఇష్టపడ్డాను. అతడి నుంచి వేధింపులు ఎదుర్కొన్నా. దానికంటే ముందు కూడా అలాంటి ప్రేమనే చూశా. రిలేషన్‌షిప్‌లో ఎందుకు ఇలా జరుగుతుంది? అని భయపడ్డా. ప్రస్తుతానికి ప్రశాంతంగా ఉన్నా. గత అనుభవాల వల్ల ప్రేమలో పడాలంటే ఎంతగానో ఆలోచిస్తున్నా" అని ఆమె తెలిపారు.



# త్రివేణి సంగమంలో టాలీవుడ్ హీరోయిన్.

మూవీన్యూస్,13 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ వద్ద జరుగుతున్న మహా కుంభమేళాకు కోట్లాది మంది ప్రజలు తరలివస్తున్నారు. మరోవైపు ఈ మహా కుంభమేళాకు సెలబ్రెటీలు సైతం క్యూ కట్టాయి. ఇప్పటికే చాలా మంది సినీతారలు ప్రవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఇప్పటికే విజయ్ దేవరకొండ, హేమ మాలినీ, సంయుక్త మీనన్, శ్రీనిధి శెట్టి, బింధుమాధవి, ప్రియాంక జైన్, రాజ్ కుమార్ రావు వంటి సినీతారలు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. తాజాగా మరో హీరోయిన్ కుంభమేళాలో సందడి చేసింది. ఆమె మరెవరో కాదు.. టాలీవుడ్ హీరోయిన్ సోనాల్ చౌహాన్. సంప్రదాయంగా పద్దతిగా దుస్తులు ధరించి త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించి సూర్య నమస్కారం చేసింది. తన ఆధ్యాత్మిక యాత్రకు సంబంధించిన ఫోటోస్ సోషల్ మీడియాలో షేర్ చేసింది.సోనాల్ చౌహన్ హిందీలో అనేక చిత్రాల్లో నటించింది. కానీ ఆమె తెలుగు ప్రేక్షకులకు సైతం సుపరిచితమే. రెయిన్ బో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత లెజెండ్, డిక్టేటర్, రూలర్ వంటి చిత్రాల్లో బాలకృష్ణతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది.అలాగే పండగ చేస్కో, షేర్, ది ఘోస్ట్, ఆదిపురుష్ వంటి చిత్రాల్లో కీలకపాత్రలు పోషించింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఎఫ్ 3 మూవీలో స్పెషల్ సాంగ్ చేసింది సోనాల్. ప్రస్తుతం ఈ బ్యూటీకి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది.అలాగే ఇప్పుడు ఈ బ్యూటీకి హిందీలో మంచి ఆఫర్స్ వస్తున్నాయి. కానీ అంతగా క్రేజ్ మాత్రం సంపాదించుకోలేకపోతుంది. నెట్టింట నిత్యం గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది సోనాల్. తాజాగా ఆధ్యాత్మక యాత్ర పిక్స్ పంచుకుంది.



Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com